ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 13 మే 2025 | 5



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 43.0 (సోమవారం)
కనిష్ఠం: 27.0

నిర్లక్ష్యంగా పనిచేస్తే.. జీతాలు ఆపండి

- ఇక ప్రతి శనివారం హౌసింగ్‌డే
- కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

రాజమహేంద్రవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ పనుల వేగవంతానికి కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వివిధ అంశాలపై ఆమె సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో అదనపు రుణ సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారులతో మమేకం కావాలన్నారు. గృహ నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి జీతాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు.ఉపాధి హామీ పథకం కింద ఫామ్ పాండ్‌లను వర్షాకాలం వచ్చేలోపుగా పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు అండగా నిలిచే క్రమంలో జిల్లాకు ఈ ఖరీఫ్ సీజన్‌కు 1.10 లక్షల సీసీఆర్సీ కార్డులు లక్ష్యంగా ఇచ్చారన్నారు.ఈ-క్రాప్ బుకింగ్, అడంగల్‌ను అనుసరించి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను జారీ చేయాల్సి ఉంటుందని చెప్పారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుపై ఆర్డీవోలు నిర్ధారణ చేసుకోవాలన్నారు.ఎవరైనా తహశీల్దార్ పనితీరులో అలసత్వంగా ఉంటే సంబంధిత ఆర్డీవో బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రీ సర్వే, స్వామిత్ర సర్వే పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. రబీ ధాన్యం లక్ష్యాలు పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



స్కిల్ డెవలప్‌మెంట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చిత్రంలో యువత

నేర్చుకుంటామంటే.. వచ్చేస్తోంది!

రాజమహేంద్రవరంలో మొబైల్ ట్రైనింగ్ వాహనం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థుల వద్దకే వెళ్లి స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. నేషనల్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన సౌరశక్తి ఆధారిత మొబైల్ ట్రైనింగ్ వాహనాన్ని అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అనిల్, టీడీపీ నాయకులతో కలిసి సోమవారం మోరంపూడిలో ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దక్షిణ భారత దేశంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఒకే ఒక్క వాహనం రాజమహేంద్రవరంలో తొలిసారిగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఈ వాహనంలో స్కిల్ డవలప్‌మెంట్‌కు సంబంధించి 12 అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ మొబైల్ వాహనం యువత వద్దకే వెళ్లి శిక్షణ ఇస్తుందన్నారు. భవానీ చారిటబుల్ ట్రస్ట్,అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో యువత రూ.50 వేలు ఖర్చుపెట్టుకుని నేర్చుకునే కోర్సును ఉచితంగా నేర్పించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

టెంపుల్‌గా.. పెట్టండి!

భక్తజన..భోజనంబు




వాడపల్లిలో అన్నదానం(ఫైల్)

భక్తుల కడుపు నింపండి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలల్లో భక్తులు వస్తుంటారు. ఏటా కోట్లలో విరాళాలు అందుతున్నాయి. ప్రస్తుతం అన్నవరం,వాడపల్లి ఆలయాలకు వేలాదిగా వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.అన్నవరం కొండపై నిత్యం నాలుగు వేల మంది భక్తులకు నిత్యాన్నదానం అమలవుతోంది. వాడపల్లిలో శని,ఆదివారాల్లో 50 వేల వరకు, మిగిలిన రోజుల్లో 10 వేల మంది వరకు భక్తులకు అన్నదానం అందుతోంది. ఈ రెండు ఆలయాలకు కొన్నేళ్లుగా భారీగా భక్తులు తరలివస్తోన్న నేపథ్యంలో మరింత మందికి పరిమితిలేని విధంగా అన్న దానం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.ఈ నెల 6న అన్ని ఆలయాల ఈవోలతో అమరావతిలో సమీక్షించిన సీఎం భక్తులకు ఇబ్బందిలేకుండా అన్న దానం అమలు చేయాలని ఆదేశించారు. దీంతో ఈ రెండు ఆలయాల్లో భక్తులకు మరింత మందికి అన్న ప్రసాదం అందనుంది.

తిరుపతిలో తినలేకపోతున్నాం.. గత ప్రభుత్వంలో ఇదీ భక్తుల మాట.. ప్రభుత్వం మారింది.. అంతే అన్నదానం అమృతమయంగా మారింది. సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతిలో అన్నదాన ప్రసాదాన్ని అమోఘంగా మార్చారు. నాణ్యతగా ఉండేలా చూస్తున్నారు.. ఒక్క తిరుపతిలోనే కాదు.. జిల్లాల్లోని ప్రధాన ఆలయాల్లోనూ నిత్యాన్నదానం చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు ఆలయాల్లో నిత్యాన్నదానం చేయాలని ఆదేశించారు. అందులో ఒకటి అన్నవరం.. రెండోది వాడపల్లి. అలాగే తలుపులమ్మ లోవ ఆలయంపై నివేదికివ్వాలని సూచించారు. సీఎం ఆదేశాల అమలుకు అధికారులు పరుగులు పెడుతున్నారు.

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- అన్నవరం, వాడపల్లిలో అమలు
- ఇప్పటికే వేలాదిమందికి అన్నదానం
- మరింత పెంచేందుకు సన్నాహాలు
- అన్నవరంలో నిధుల కొరత
- వాడపల్లిలో అన్నదానానికి ఓకే
- తలుపులమ్మ లోవపై నివేదిక
- 17న అమరావతిలో సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులకు పరిమితి లేకుండా నిత్యాన్నదానం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ కడుపునిండా భోజనం వడ్డించాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం చంద్రబాబు ఇటీవల దేవదాయశాఖపై సమీక్ష సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో నిరంతరం భక్తులకు నిత్యాన్నదానం అందుతున్నా ఇకపై మరింతమందికి భోజనం అందించేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. అన్నవరం దేవస్థానానికి నిధుల కొరత వేధిస్తుండడం, భోజనశాలలు ఏమాత్రం సరిపోకపోవడంతో దీన్ని ఎలా అమలుచేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. వాడపల్లికి నిధులు పుష్కలంగా ఉండడంతో పరిమితి లేకుండా మరింత మందికి అన్నదానం అమలుచేయనున్నారు. తుని నియోజవర్గంలోని తలుపులమ్మ లోవ ఆలయంలో నిత్యాన్నదానం అసలు ఇంతవరకు లేదు. దీంతో త్వరలో అమలుకు వీలుగా సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం నివేదిక కోరింది.

అన్నవరంలో తర్జనభర్జన..

సీఎం ఆదేశాలను తక్షణం అమలుచేసే విషయంలో అన్నవరం దేవస్థానం అధికారులు తల పట్టుకుంటున్నారు. అన్నప్రసాదం సంఖ్య పెరిగితే ఆర్థిక భారం ఎలా మోయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. 1987లో సత్యదేవా నిత్యన్నదాన ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ఈ ట్రస్ట్‌లో రూ.64 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిపై ఏటా రూ.4.5 కోట్లు వడ్డీ లభిస్తోంది. సాధారణ రోజుల్లో నాలుగు వేలు, శని, ఆదివారాల్లో 5 వేల నుంచి 6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. వడ్డన సిబ్బంది జీతభత్యాలతో కలిపితే ఒక్కో భోజనానికి దేవస్థానానికి రూ.34 వ్యయమవుతోంది. కార్తీకమాసం వంటి పుణ్యమాసాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత పులిహోర, దద్ధోజన ప్రసాదాన్ని అందిస్తున్నారు. వీటి నిర్వహణకు ప్రస్తుతం లభిస్తున్న వడ్డీ డబ్బులు చాలీచాలనట్టుగా ఉన్నాయి. సీఎం చంద్రబాబుతో ప్రకటనతో పరిమితిలేని నిత్యాన్నదానం ఎలా అమలుచేయాలనేదానిపై ఆలయ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అన్నవరంలో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ చేయాలంటే సుమారు రోజుకు 10 వేల మందికి అందించాల్సి ఉంటుంది. పైగా దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న భోజన హాలు చిన్నగా ఉంది. దీంతో నూతన అన్నప్రసాద భవననిర్మాణం ప్రసాద్ స్కీంలో రూ.11.50 కోట్లతో మంజూరైంది. తీరా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరే సింహాచలం ఘటనలో నాసిరకం పనులతో దొరికిపోవడంతో ప్రభుత్వం అతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో అన్నవరం ప్రసాద్ స్కీం పనులు ఆగిపోయే పరిస్థితి తలెత్తింది. ఖర్చులన్నీ దేవదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అక్కడనుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా వ్యవహరిస్తామన్నారు.



వాడపల్లిలో ఓకే..

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి గడచిన కొన్నేళ్లుగా వేలల్లో భక్తులు పోటెత్తుతున్నారు. ఈమేరకు ఆలయంలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అపరిమిత అన్నదానం అమలు చేయాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో దీనికి తగ్గ సన్నాహాలను అధికారులు ఆరంభించారు. తుని నియోజకవర్గంలోని తలుపులమ్మ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ రద్దీ లెక్కలు సీఎం సమీక్షలో అధికారులు ప్రస్తావించారు. ఇక్కడ కూడా అన్నదానం అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ ఆలయంలో అసలు అన్నదానం అమలు కావడం లేదు. అన్నదానం అమలు సాధ్యాసాధ్యాలపై తలుపులమ్మ ఆలయ ఈవోను ప్రభుత్వం నివేదిక కోరింది. ఇక్కడకు ఆదివారం 10 వేల మంది వరకు భక్తులు వస్తారని.. మిగిలిన రోజుల్లో వెయ్యి మంది వరకు ఉంటారని అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. పైగా ఈ ఆలయానికి వచ్చే భక్తులు సొంతంగా ఇక్కడే వండుకుని తినే ఏర్పాట్లతో వస్తారని.. అన్నదానం అవశ్యకత తక్కువేనని తెలిపారు. అయితే లోవలో అన్నదానం అమలు చేయాలా? లేదా? అనేదానిపై ఈనెల 17న అమరావతిలో జరగనున్న సమీక్షలో స్పష్టత రానుంది. ఆలయాల్లో భక్తులకు అందుతున్న సేవలు, భోజన నాణ్యతపై తరచుగా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తోంది. ఏ మాత్రం నాణ్యతలో తేడా ఉందని ఫిర్యాదులు వచ్చినా ఆలయానికి ఇచ్చే పాయింట్లను తగ్గిస్తూ అధికారులను పరుగులు పెట్టిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారాక అనేక ఆలయాల్లో అన్న ప్రసాదంలో నాణ్యత రెట్టింపుకావడంతో భక్తులు ఆనందిస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 259 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం,మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు నిర్వహించారు. మొదటి ఏడాది 3187 మంది విద్యార్థులకు 3 వేలు, రెండో ఏడాది 298కి 250 మంది హాజరయ్యారని ఆర్ఐవో నరసింహం తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 34 మంది మొత్తం 259 మంది గైర్హాజరయ్యారన్నారు.

మాజీ ఎంపీ భరత్‌పై పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రతిష్టను దిగజార్చే విధంగా అసత్య ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజుకు సోమవారం ఫిర్యాదు అందజేశారు.కూటమి ప్రభుత్వం వచ్చాక స్పా సెంటర్లలో ఎలాంటి తప్పు జరిగినా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మూయించడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. టీడీపీపై బురద జల్లాలనే దురుద్దేశంతో భరత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు,లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక స్టాక్ పాయింట్లు

రాజమహేంద్రవరం/కొవ్వూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణిసుస్మిత తెలిపారు.ధవళేశ్వరం, కొవ్వూరు మండలం చిడిపి, కుమారదేవం 12 ఇసుక యార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజమహేంద్రవరం డివి జన్‌లోఇప్పటి వరకూ 1.08 లక్షల టన్నుల ఇసుకను స్టాక్ యార్డులో నిల్వ ఉంచామన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 77,196 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు.

రోడ్డెక్కిన అన్నదాత

- జాతీయ రహదారిపై బైఠాయింపు
- రెండున్నర గంటల పాటు నిరసన
- అధికారుల హామీతో విరమణ


జాతీయ రహదారిపై బైఠాయించి రైతుల నిరసన ప్రదర్శన


కొవ్వూరు - గుండుగొలను జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్


డీఎం రాధికను టార్గెట్‌పై ప్రశ్నిస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు రోడ్డెక్కారు.. పండించిన పంటను కొనుగోలు చేయాలంటూ భీష్మించారు. అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకూ విరమించేదిలేదని సుమారు రెండున్నర గంటల పాటు రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు.కొవ్వూరు నియోజకవర్గంలో 1,13,090 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ఇప్పటి వరకు 78,731 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకనూ 13,787 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయవలసి ఉంది. ఇప్పటికే లక్ష్యం పూర్తయిందని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయడంలేదు. ఒక పక్క పంట చేతికొచ్చినా మరో వైపు కొనుగోళ్లకు అవకాశం లేకపోవడంతో రైతులంతా కలిసి ఆందోళనకు దిగారు.కొవ్వూరు, గుండుగొలను నేషనల్ హైవేపై గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో దొమ్మేరు వైపు ధాన్యం బస్తాలు లోడ్‌చేసుకుని వచ్చిన ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఎండను సైతం లెక్క చేయకుండా రోడ్డుపై బైఠాయించి సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. హైవేపై రెండు వైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె. విజయబాబు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏవో ఎ.గంగాధర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి రోడ్డుకు అడ్డంగా పెట్టిన ధాన్యం ట్రాక్టర్లను తొలగించాలని కోరారు. అయినా మాట వినకపోవడంతో పోలీసులు బలవంతంగా రైతులను తొలగించే ప్రయత్నం చేశారు. అయినా రైతులు తగ్గలేదు. సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదని పట్టుబట్టారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో గత పంట కంటే 70 శాతం అధికంగా కొనుగోలు చేశారని, కొవ్వూరు డివిజన్‌లో తక్కువ టార్గెట్లు ఇచ్చారన్నారు. ప్రస్తుత పంటలో అధిక దిగుబడులు వచ్చాయని పాత లెక్కల ప్రకారం కొనుగోలు చేస్తే ఎలా అని ఆర్డీవోను ప్రశ్నించారు. వాడపల్లికి చెందిన రైతు స్వామి మాట్లాడుతూ వెంటనే టార్గెట్లను పెంపుదల చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన రైతు సుబ్బారావు మాట్లాడుతూ ఒక ప్రక్క వర్షాలు పడుతున్నాయి ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. నందమూరుకు చెందిన మారిన రామకృష్ణ మాట్లాడుతూ వెంటనే ఆర్ఎస్‌కేల టార్గెట్లు పెంచి పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అదే సమయంలో అటుగా వెళుతున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ రైతులను చూసి కారు దిగి వచ్చారు. విషయం తెలుసుకుని ఆర్డీవో రాణి సుస్మిత, జేసీ ఎస్.చిన్నరాముడు, సివిల్ సప్లయిస్ డిఎం రాధికలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు.ఈ మేరకు రైతులు ఆందోళన విరమించారు. ఆందోళనలో కొవ్వూరు, చాగల్లు మండలాల రైతులు పాల్గొన్నారు.


పీజీఆర్ఎస్‌లో నేరుగా ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌లో 159 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరంరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల కేంద్రంలో పాలన కొనసాగాలనే ఉద్దేశంతో పాలనా ప్రక్రియలో ప్రజలకు ప్రథమస్థానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర సంకల్పం అనే కార్యక్రమాన్ని చేపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 159 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో చొరవచూపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 24గంటల్లో పరిష్కరించాల్సినవి 5, 48 గంటల్లో పరిష్కరించాల్సినవి 35 , 72 గంటల్లో పరిష్కరించాల్సినవి 16 అర్జీలు ఉన్నట్టు చెప్పారు. రీ ఓపెన్‌చేసినవి 137 ఉన్నాయన్నారు. స్వర్ణ ఆంధ్ర సంకల్పం కార్యక్రమానికి సంబంధించి సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు.దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో వాస్తవాలని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి సీనియర్ అఖిల భారత సర్వీస్ అధికారులు ఎంపిక చేసిన గ్రామాల్లో మూడు రోజులు పర్యటిస్తారని తెలిపారు. ఈ పర్యటనల్లో వారు నేరుగా ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని చెప్పారు.


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) సుబ్బరాజు

ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 34 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాయలంలో సోమవారం ఏర్పాటు చేసిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో 34 మంది ఫిర్యాదులను అందజేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం.మురళీ కృష్ణ(పరిపాలన), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు) మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.చట్ట పరిధిలో త్వరితగతిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భానుడి మంట.. వరుణుడి ఆట!


పిడుగుపాటుకు మృత్యువాత

- రాజమండ్రిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఒక్కసారిగా మారిన వాతావరణం
- పిడుగు పాటుకు 4 దూడలు మృత్యువాత


మాతంగమ్మ మెట్ట వద్ద చెట్టు కూలిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్

గోపాలపురం,మే 12 (ఆంధ్రజ్యోతి) :ఈ ఏడాది వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కావడంలేదు.. అప్పుడే ఎండ మండిపోతోంది..ఆ మరుక్షణమే చినుకులు పడుతున్నాయి..ఎప్పుడు ఎండ కాస్తుందో.. ఎప్పుడు వానపడుతుందో తెలియడంలేదు.. సోమవారం భానుడు మండిపడ్డాడు.. బయటకు రావాలంటేనే జనం భయపడిపోయారు.వేడిగాలులు తాళలేక అల్లాడిపోయారు. ఎందుకంటే రాజమహేంద్రవరంలో 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు విపరీతమైన ఎండ కారణంగా ఇళ్లకే జనాలు పరిమితమయ్యారు.సుమారు 4 గంటల సమయంలో ఆకాశంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది.. కాస్త చల్లబడింది.. గోపాలపురంలో కారుమబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మాతంగమ్మ మెట్ట వద్ద ఈదురు గాలుల కారణంగా చెట్టువిరిగి జాతీయరహదారిపై పడడంతో గోపాల పురం నుంచి జగన్నాథపురం వరకు సుమారు 6 కిలోమీటర్ల మేరా జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే పెద్దగూడెంకు చెందిన అక్కాబత్తుల పెదవెంకటేశ్‌కు చెందిన నాలుగు గేదె దూడలు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి.కనీసం రూ.70 వేల వరకు ఉంటుందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.





పొగ మంచు కురిసె..

పగలు మండే ఎండలు మంటపుట్టిస్తుంటే.. సాయంత్రం ఆకస్మికంగా వాన వచ్చేస్తోంది. ఈ విచిత్ర వాతావరణంతో జనం రకరకాల పాట్లు పడుతున్నారు. దీనికితోడు వేకువజామున పొగమంచు కురుస్తూ మూడు కాలాలను ఒకేసారి అనుభవంలోకి తెస్తోంది. మండపేట పట్టణంలో పంటపొలాలపై సోమవారం తెల్లవారుజామున కనిపించిన పొగమంచు దృశ్యాలివి.. - మండపేట


సీప్లేన్ (ఫైల్‌ఫొటో)

'నీళ్లా'కాశంలో..

- త్వరలో సీప్లేన్‌లో రయ్.. రయ్
- వాటర్ ఏరో డ్రోమ్‌ల ఏర్పాటుకు కసరత్తు
- సముద్ర, నది, కాలువలకు అనుసంధానంగా రవాణా
- కాకినాడ - కోనసీమ ప్రాంతాల మధ్య రాకపోకలు
- ప్రభుత్వానికి రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ప్రతిపాదన


కాకినాడ బీచ్‌లో సందడి


బీచ్‌లో పారాచూట్‌తో విన్యాసాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో సీప్లేన్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే విజయవాడ -శ్రీశైలం మధ్య ఈ సర్వీసులు ప్రారంభంకాగా.. మరికొన్ని రోజుల్లో కాకినాడ-కోనసీమ జిల్లాల్లోనూ ఈ తరహా సీ ప్లేన్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు తీసుకొస్తున్నారు. దీనిద్వారా నీటిలోనే ప్రయాణం సాగనుంది. తక్కువ సమయంలోనే నిర్ణీత గమ్యానికి చేరుకోవచ్చు. నాలుగేళ్ల కిందట గుజరాత్‌లో ఈ సీప్లేన్ సర్వీసులను ప్రారంభించారు. అలాగే ఆమధ్య విజయవాడ కృష్ణా నది నుంచి శ్రీశైలం వరకు కూడా సీ ప్లేన్ నడిపారు. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను కలిపేలా రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదించింది. అరకు నుంచి తిరుపతి వరకు ప్రతిపాదించిన 8 ప్రాంతాల మధ్య సీ ప్లేన్‌లు నడిపేలా రూట్లను ప్రతిపాదించింది. డీపీఆర్‌లు తయారుచేసి కేంద్ర విమానయానశాఖకు పంపనున్నారు. వాటిని పరిశీలించి, ఆమోదించిన లోకేషన్లలో వాటర్ డ్రోమ్‌లను కేంద్రం అభివృద్ధి చేయనుంది. ఈనేపథ్యంలో సీప్లేన్ నడిపేందుకు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు. ముఖ్యంగా సముద్ర, నదీతీర ప్రాంతాలతోపాటు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను ఎంచుకున్నారు. అరకు నుంచి తిరుపతి వరకు ఈ ప్లేన్‌లు తిరిగేలా రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధంచేశారు. అరకు-లంబసింగి, లంబసింగి-రుషికొండ, రుషికొండ-కాకినాడ, కాకినాడ-కోనసీమ, కోనసీమ-విజయవాడ, విజయవాడ-శ్రీశైలం, శ్రీశైలం-తిరుపతి మధ్య సీప్లేన్‌ను నడిపే ఆలోచనలో ఉన్నారు. ఇక మన ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలోని కాకినాడ సాగరతీరం నుంచి.. కోనసీమలో గోదావరి బ్యాక్ వాటర్ నిల్వ చేసే చోట ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ తీరం.. టూరిజం హబ్..

ఇప్పటికే కాకినాడ సాగరతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే పనులు పెద్దఎత్తున సాగుతున్నాయి. మరోవైపు పర్యాటకుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు నేపథ్యంలో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారు. వీరికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. సెలవుల్లోను, వారాంతాల్లోను పేరాచ్యూట్ వంటివి ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఎమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులకు పూర్తిస్థాయి వినోదాన్నిచ్చే అనేక పనులు అక్కడ జరుగుతున్నాయి. సమీపంలోనే కొత్తగా రిసార్ట్స్ కూడా ఏర్పాటవుతున్నాయి. మరో ఏడాది దాటితే మొత్తం కాకినాడ సాగరతీరం పూర్తిగా టూరిస్టుల హబ్‌గా మారనుంది. ఇక పచ్చని సీమగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలోని తీర ప్రాంతాలకు కూడా ఇప్పటికే పర్యాటకుల తాకిడి అధికంగా కనిపిస్తోంది. గోదావరి తీరాన ఆధ్యాత్మికంగాను ఆ ప్రాంతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో కాకినాడ సాగరతీరం నుంచి కోనసీమకు సీప్లేన్ అందుబాటులోకి వస్తే.. రెండు జిల్లాల వాసులకు మధ్య దూరం ఇంకాస్త దగ్గర కానుంది.

కాకినాడ నుంచి రుషికొండ బీచ్‌కు..

మరోవైపు కాకినాడ సాగర తీరం నుంచి విశాఖ సమీపంలోని రుషికొండ బీచ్‌కు కూడా సీప్లేన్ అందుబాటులోకి రానుంది. అక్కడ ఏరోడ్రోమ్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. సముద్ర తీర ప్రాంతం, నది, కాలువలకు అనుసంధానంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు కన్సల్టెన్సీల కోసం రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మార్చి నెలలో టెండర్లు పిలిచింది. వాటిని పరిశీలన కోసం పంపారు. మొదటి దశలో ప్రతిపాదించిన ప్రాంతాల్లో కాకినాడ, కోనసీమ ఉండడంతో మరికొన్ని నెలల్లోనే సీ ప్లేన్‌లు అందుబాటులోకి రానున్నాయి.


30 రకాల విత్తనాలతో పెరుగుతున్న మొక్కలు

- 30 రకాల విత్తనాలతో పోషకాల తయారీ
- సహజ పద్ధతుల్లో భూమి సారవంతానికి కృషి
- ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల మొగ్గు
- పీఎండీఎస్‌ను ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ

పొలంలోనే ఎరువుల తయారీ

ఉప్పలగుప్తం, మే 12 (ఆంధ్రజ్యోతి): నాట్లు వేసిన తర్వాత రసాయనిక ఎరువులు వాడనవసరం లేదు. ప్రతి పంటకు ముందుగానే నేలలో ఎరువులు తయారు చేసుకోవచ్చు. కేవలం 30 రకాల విత్తనాలు పొలంలో చల్లుకుని పైరుకు కావలసిన పోషకాలను సహజ పద్ధతిలో తయారు చేసుకోవచ్చు. ఒకప్పుడు పశువుల పెంట, ఇతర సహజ సిద్ధ ఎరువుల వాడకంతో రైతులు భూసారాన్నిపెంచుకునేవారు. ఎకరా దిగుబడులు తక్కువే అయినా నాణ్యమైన పంట చేతికొచ్చేది. అందుకే తాము పండించిన ధాన్యాన్నే మరపట్టించి, బియ్యాన్ని నిల్వ చేసుకుని తినేవారు. తొలకరి వానలకు మట్టి కమ్మని వాసనతో గుబాళించేది. అనంతర కాలంలో ఎకరా దిగుబడులు గణనీయంగా పెరగాలన్న లక్ష్యాలు రైతులను రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకానికి పురిగొల్పాయి. ఇదే అదనుగా కార్పొరేట్ కంపెనీలు వివిధ రకాల రసాయనాల ఎరువులతో రైతులను ఆదాయ వనరుల పెంపు ఆలోచన వైపు మళ్లించాయి. ఫలితంగా రసాయనిక ఎరువులు వినియోగించనిదే పంట పండని పరిస్థితి ఏర్పడింది. రసాయనిక ఎరువుల వాడకంతో దిగుబడులు పెరిగిన నిష్పత్తిలోనే పైరుకు తెగుళ్ల బెడద ఏర్పడింది. పంట నాణ్యత తగ్గింది. తాను పండించిన గింజలను తానే తినలేని పరిస్థితిలో అన్నదాత అయోమయంలోపడ్డాడు. పొలాల్లో మట్టి కాలుష్యంతో విషాల్ని వెదజల్లుతోంది. అన్నదాత ఆలోచనలో పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చాలా కాలంగా కొందరు రైతులు తమకున్న పొలంలోని కొంత విస్తీర్ణంలో సేంద్రియ ఎరువులతో ప్రకృతి సాగు చేస్తున్నారు. చీడపీడల నివారణకు సహజ పద్ధతుల్లోనే నివారణ చర్యలు చేపడుతున్నారు. ఆ పంటనే ఏడాది పాటు తింటున్నారు.

భూసార పరిరక్షణకు అవసరమైన సహజ పోషకాలు,సూక్ష్మ పోషకాలు ఈ 30 రకాల పైరు నుంచి లభిస్తాయి. నత్రజని భూమిలో కావలసినంత నిల్వ ఉంటుంది. ఆయా విత్తన జాతుల నుంచి జింకు, లవణాలు, వివిధ పోషకాలు నేలలోనే పేరుకుని నేల దుక్కి అనంతరం పైరుకు అందుతాయి. భూమిలో వానపాముల ఉత్పత్తి పెరిగి నేల గుల్లబారుతుంది. నేలకు నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. పశువులకు పచ్చిగడ్డి మేత దొరుకుతుంది. పైరుకు రసాయనిక ఎరువుల ఆవశ్యకత ఉండదు. ప్రకృతి విధానంలో పోషకాలు అందడంతో పైరుకు చీడపీడల బెడద ఉండదు. పంటలో నాణ్యత ఉంటుంది. ఫలితంగా మార్కెట్లో ప్రకృతిసాగు దిగుబడులకు మంచి గిరాకీ ఉంటుంది. ఇప్పటికే సేంద్రియ ఎరువులు వాడి, ప్రకృతి సాగు చేస్తున్న రైతుల ఉత్పత్తులకు ఎంత గిరాకీ ఉందో అందరికీ తెలిసిందే. ఎకరా పెట్టుబడులు తగ్గడంతో దిగుబడులు తగ్గినా మార్కెట్ డిమాండ్‌తో ఎకరాకు వచ్చే ఆదాయం సంతృప్తికరంగానే ఉంటుందన్నది రైతుల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి.

నాట్లు వేశాక ఎరువులను వాడటానికి బదులు ముందుగానే నేలలో పంటకు అవసరమైన సహజ పోషకాలను నిల్వ చేస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనతోనే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం పేరుతో ప్రభుత్వం పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్) విధానాన్ని అమలు చేస్తోంది.


ప్రకృతి సాగు పద్ధతితో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేను


గొల్లవిల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (పాత చిత్రం)

నర్సుల సేవలు..

అనన్యసామాన్యం

- కొవిడ్ సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేశారు: డిప్యూటీ సీఎం పవన్


పిఠాపురం నియోజకవర్గంలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్


ఉత్తమ సేవలందించిన పిఠాపురం స్టాఫ్ నర్సు చిన్నారిని సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత చేకూరేలా నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, వారి సేవల ద్వారా వృత్తికే గౌరవాన్ని తీసుకువస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ కొనియాడారు. నిస్వార్థంగా వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులతో సమావేశమయ్యారు. ఉత్తమ సేవలు అందిస్తున్న 8మంది స్టాఫ్‌నర్సులను సత్కరించారు. నర్సుల చేతిస్పర్శ కూడా రోగుల్లో మానసిక స్థైర్యాన్ని, సాంత్వనను కలగచేస్తుందని తెలిపారు. విధినిర్వహణలో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరు మరిచిపోలేరని చెప్పారు. మీరు పడే కష్టం, శ్రమ తనకు తెలుసునని తెలిపారు. కొవిడ్‌సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నర్సులు విధులు నిర్వహించిన విషయం మరువలేమని చెప్పారు. ఇటీవల సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురైనప్పుడు తాను ఆస్పత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరొకసారి మీ కష్టం గుర్తుకు వచ్చిందని వివరించారు. అందుకే నర్సులను స్వయంగా కలిసి మీరు అందించే సేవలు నిరుపమానమైనవని చెప్పి కృతజ్ఞతలు తెలపాలని భావించానని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మిమ్మల్ని కలిసే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. వారు తెలిపిన సమస్యలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఉత్తమ స్టాఫ్‌నర్సులు ఆర్.చిన్నారి, జి.సత్యవతి, బి.జీవిత, టి.సూర్యామణి, జె.భాగ్యరేఖ, పి.సూర్యకుమారి, ఎం.బుజ్జమ్మ, వి.విమలకుమారిలను పవన్ సత్కరించి పురస్కారాలు అందజేశారు.

మోతుగూడెంలో అతిథిగృహాలు, రిసార్ట్స్ తనిఖీ


మోతుగూడెం రిసార్ట్స్‌లో పర్యాటకుల వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

మోతుగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిసార్ట్స్‌ల యజమానులకు పలు సూచనలు ఇచ్చారు. మద్యం, గంజాయి సేవించడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలని యజమానులకు తెలియజేశారు. అనంతరం అతిథిగృహాలకు కస్టమర్లు వచ్చినప్పుడు ప్రతి వ్యక్తి పేరు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, నమోదు చేసిన తర్వాత గదులు కేటాయించాలని రిసెప్షన్ బుక్‌లో కచ్చితంగా వారి వివరాలు నమోదు చేయాలని అతిథిగృహ యజమానులకు తెలిపారు. అనంతరం కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా అతిథిగృహాలకు వస్తే వెంటనే పోలీసులకు 94409 00757 నెంబరులో సమాచారం ఇవ్వాలని సూచించారు.


సూర్యారావుపేట సముద్ర తీరంలో భావనారాయణ స్వామికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

వైభవంగా భావనారాయణస్వామికి చక్రస్నానం



సర్పవరం జంక్షన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయం వద్ద స్వామివారికి పండితులు ప్రత్యేక పూజలు జరిపి పుష్పక వాహనంపై వేలాది మంది భక్తుల ఊరేగింపు నడుమ సూర్యారావుపేట సముద్రతీరానికి తోడ్కొని వెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా తయారు చేయించిన వేదికపై చక్రపెరుమాళ్లకు అభిషేకం చేసిన తర్వాత సముద్రనీటితో చక్ర తీర్థ ప్రోక్షణ చేయించారు. సాయంత్రం ఆళ్వార్లు స్వామివారు చినపుష్పక వాహనం (శేష వాహనం)పై వేంచేయగా గ్రామోత్సవం, చోరోత్సవం జరిపారు. సహాయ కమిషనరు, ఈవో ఎం.లక్ష్మీనారాయణ, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

5 రకాల పప్పు విత్తన జాతులు, 6 రకాల చిరుధాన్యాలు, 4 రకాల పచ్చిరొట్ట విత్తనాలు, రెండు రకాల సుగంధ ద్రవ్యాలు, 3 రకాల ఆకుకూర విత్తనాలు, 8 రకాల కాయగూర విత్తనాలు, రెండు రకాల నూనె గింజల విత్తనాలు... మొత్తం 30 రకాల విత్తనాలను దాళ్వా కోతల సమయంలో పొలంలో చల్లుతారు. లేదా మూడో పంటగా చల్లి సాగు చేస్తారు.



రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్నాం

ఎస్ఎం షంషీ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు

ప్రకృతి సాగుపై వ్యవసాయ శాఖ రైతులకు గ్రామగ్రామనా అవగాహన కల్పిస్తోంది. ఇటీవల కోనసీమవ్యాప్తంగా రైతులకు పీఎండీఎస్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. 30 రకాల విత్తనాల సంచులను రైతులకు అందించారు. ప్రస్తుతం పలువురు రైతులు కోతల సమయంలో ఈ విత్తనాలను చల్లుతున్నారు. ఈ విధానంతో పొలాలకు సారం చేకూరడంతో పాటు సాగుకు ముందే కొంత ఆదాయాన్ని సమీకరించుకోవచ్చు. ఆకు కూరలు, కాయగూరలు, అపరాలతో తదుపరి సాగుకు ముందే రైతుకు ఆదాయం లభిస్తుంది. ఈ 30 రకాల వేర్లను భూమిలోనే దుక్కి చేయడంతో అవసరమైన లవణాలు, నత్రజని, ఇతర పోషకాలు పైరుకు పుష్కలంగా లభిస్తాయి. ప్రకృతి సాగు చేస్తున్న రైతులతో పాటు గ్రామంలో మరికొందరు రైతులను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎండీఎస్ అమలు చేస్తున్నాం.

వేడుకగా సత్యదేవుడి చక్రస్నానం

నేడు శ్రీపుష్పయాగం



పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్విక్కులు, ఈవో

అన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం పంపాసరోవరం వద్ద చక్రస్నానం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను... పెళ్లిపెద్దలైన సీతారాములను మేళతాళాలు, పం డితుల వేదమంత్రోచ్చరణల నడుమ కొండపై నుంచి ఘాట్ రోడ్డు గుండా పంపాతీరం వద్ద నున్న ప్రత్యేక వేదిక వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం పంపాసరోవరంలో స్వామి, అమ్మవార్లను, త్రిశూలం, సుదర్శనచక్రంలతో ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదికవద్దకు తీసుకెళ్లి పూజలనంతరం చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలందజేశారు. ఈ సందర్భంగా కంకణ విమోచన గావించారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు చైర్మన్ ఐవీ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు

సత్యదేవుడికి శ్రీ విశ్వావసు నామసంవత్సర దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం రాత్రికి జరి గే శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. రాత్రి 8 గంటలకు స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో నవదంపతులను అర్చించి విశేషపదార్థాలను నివేదిస్తారు. అనంతరం దంపతీతాంబూలాలు అందించి మహిళలకు రవిక వస్త్రాలు బహూకరిస్తారు.

ఉల్లాసంగా నాకబలి, దండియాడింపు

సాయంత్రం 4గంటలకు అనివేటి మండపం లో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉ ల్లాసంగా జరిగాయి. అమ్మవారికి నల్లపూసలు గుచ్చి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకుసాగారు. అర్చకస్వాములు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎత్తుకుని నృత్యంచేశారు.





నృత్యం చేస్తున్న అర్చకస్వాములు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జి మాండవ కిరణ్మయికి స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, మే 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఏపీ హైకోర్టు జడ్జి మాండవ కిరణ్మయి సోమవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో దర్శనం కల్పించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం హైకోర్టు జడ్జి మాండవ కిరణ్మయి దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఏసీ సత్యనారాయణ అందించారు.

ద్రాక్షారామలో సీఎంవో కార్యదర్శి పూజలు



పూజలు చేస్తున్న మిశ్రా దంపతులు

ద్రాక్షారామ, మే 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం సీఎంవో కార్యదర్శి కార్తికేయ మిశ్రా సతీసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మిశ్రా దంపతులు భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు. మిశ్రా వెంట ఆర్డీవో దేవరకొండ అఖిల, తహశీల్దార్ మృత్యుంజయరావు, ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్నవరంలో యనమల పూజలు

అన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులు ఉన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం యనమల రామకృష్ణుడు

మంచినీటి చెరువులో మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

రంగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలోని మంచినీటి చెరువులో సోమవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఎస్ శివప్రసాద్ తెలిపారు. సుమారు 25-30 ఏళ్లు ఉండే వ్యక్తి మృతదేహం నీటిలో కనిపించగా స్థానిక వీఆర్వోకు చుట్టు పక్కలవారు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. వివరాలు తెలిసినవారు అనపర్తి సీఐ 9440796538, రంగంపేట ఎస్ఐ 9440904854లో తెలియజేయాలని కోరారు.

ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి బదిలీ

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు బదిలీ అయ్యారు. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యాన సమాచార కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్టుగా బదిలీపై వెళ్తున్నారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో అధిపతిగా ఆయన ఎన్నో ఏళ్లు సేవలందించారు.

కౌడా చైర్మన్ పదవికి తుమ్మల రాజీనామా

కార్పొరేషన్(కాకినాడ), మే 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ తుమ్మల బాబును డీసీసీబీ చైర్మన్ పదవి వరించడంతో ఒకే వ్యక్తి రెండు నామినేటెడ్ పదవుల్లో ఉండకూడదన్న నిబంధన ఉంది. దీంతో తాను కౌడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తుమ్మల వెల్లడించారు. దీంతో ఆ చైర్మన్ కుర్చీ ఖాళీ అవ్వడంతో కొంతమంది ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు.

అడ్డతీగలలో భారీ వర్షం

అడ్డతీగల(వై.రామవరం), మే 12(ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో మధ్యాహ్నం 3గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్ లేక రంపచోడవరం నుంచి అడ్డతీగల వరకు వచ్చే లైన్లలో ఇబ్బందులేర్పడి రాత్రంతా అడ్డతీగల, వై. రామవరం మండలాల్లో అంధకారం అలుముకుంది.



అడ్డతీగలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు

మాతృత్వానికే మాయని మచ్చ



పిఠాపురంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

- రెండో పెళ్లికి అడ్డువస్తుందనే చిన్నారిని పీక నులిమి చంపేసి నూతిలో పడేశారు
- అమ్మ, అమ్మమ్మ కర్కశత్వం
- హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండో పెళ్లికి అడ్డుగా ఉందనే ఉద్దేశ్యంతో కర్కశత్వం ప్రదర్శించి కన్నపేగునే చిదిమేసింది ఆ కన్న (కసాయి) తల్లి. అందుకు పూర్తిగా సహకరించింది అమ్మమ్మ. మాతృత్వానికే మాయని మచ్చగా మిగిలిన ఈ సంఘటనలో ఐదు నెలల చిన్నారిని అత్యంత పాశవికంగా పీక నులిమి చంపివేసి పక్కనే ఉన్న నూతిలో పడవేసి, క్షుద్రపూజలు జరిగినట్టు చూపించి హత్యను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయాలు వెలుగు చూడడంతో చిన్నారిని హత్య చేసిన అమ్మ, అమ్మమ్మలను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన ఐదు నెలల చిన్నారి యశ్వితను ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత చంపి నూతిలో పడవేశారని నరసింగపురం గ్రామానికి చెందిన పెదపాటి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై హత్య కేసు నమోదు చేసి ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో సాంకేతిక పరమైన అంశాలను ఆధారంగా చేసుకుని విచారణ చేపట్టారు. తల్లి, అమ్మమ్మ ఈ హత్యకు చేసినట్టు నిర్ధారణకు వచ్చారు. చనిపోయిన యశ్విత తల్లి పసుపులేటి శైలజ, పెదపాటి సతీష్ ప్రేమించి ఇరు కుటుంబాలకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్నారు. వీరికి ఐదు నెలల క్రితం పాప (యశ్విత) పుట్టింది. శైలజ వివాహం జరిగిన నాటి నుంచి భర్త తనను అత్తవారింటికి తీసుకువెళ్లకపోవడం, యశ్విత పుట్టినప్పుడు భర్త కుటుంబసభ్యులు, బంధువులు రాకపోవడం, భర్త ముందులా సఖ్యతతో లేకపోవడం శైలజ కొంతకాలంగా ఇబ్బందిగా ఉంది. అదే సమయంలో ముందు నుంచీ అనుకున్న మేనత్త కొడుకుతో కాకుండా ప్రేమించి వివాహం చేసుకోవడం, సతీష్‌కు పుట్టిన యశ్వితను అడ్డు తొలగిస్తే శైలజకు రెండో పెళ్లి చేయవచ్చని అమ్మమ్మ పసుపులేటి అన్నవరం భావించింది. అమ్మ శైలజ, అమ్మమ్మ అన్నవరం కలిసి పథకం ప్రకారం ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి చిన్నారి యశ్విత పీక నొక్కి చంపేసి వాళ్ల ఇంటి వెనుక ఉన్న అద్దాల కుమారి ఇంటి ఆవరణలో గల బావిలో పడేశారు. అనంతరం చేసిన హత్యను కప్పి పుచ్చుకునేందుకు పాపను ఎవరో మాంత్రికుడు చేతబడి చేసి చంపి ఉంటారని నమ్మించేందుకు ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వేసి క్షుద్రపూజలు జరిగినట్టు చూపించారు. అయితే అక్కడ వేసిన పసుపు, కుంకుమ ఇంటిలో నుంచి తెచ్చినట్టు ఉండటం, బావి సమీపంలో అమ్మమ్మ సెల్ పడిపోవడం తదితర అంశాల ఆధారంగా కేసు దర్యాప్తు సాగించి ఇద్దరినీ అరెస్టు చేశారు.

లోతుగా విచారణ

చిన్నారి హత్య కేసులో మరికొంత మంది పాత్ర ఉంటుందనే భావనలో పోలీసులు ఉన్నా రు. దీంతో మరింత లోతుగా విచారణ సాగించాలని నిర్ణయించారు. కోర్టు అనుమతితో అమ్మ, అమ్మమ్మలను అదుపులోకి తీసుకోవాలని భావిస్తున్నారు. భర్త, మేనమామ, తాతయ్య, ఇతర కుటుంబసభ్యుల పాత్రపై విచారణ జరపనున్నారు. అదే విధంగా శైలజ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని వాట్సాప్ సంభాషణలు, ఫోన్ కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు.

అందరికి న్యాయం చెప్పే...

హత్య కేసులో కీలకంగా ఉన్న చిన్నారి యశ్విత అమ్మమ్మ అన్నవరం వారి కులపెద్దల్లో ఒకరిగా ఉంది. పలు విషయాల్లో న్యాయం చెప్తూ ఉండడంతో పాటు గొడవలు, వివాదాలు సర్దుబాటు చేస్తుంది. అందరికీ న్యాయం చెప్పే ఈమె మాత్రం కూతురితో కలిసి ముక్కుపచ్చలారని ఐదు నెలల ఆడబిడ్డను పీక నులిమి హత్య చేయడం విస్మయాన్ని కలిగించింది. అమ్మ, అమ్మమ్మలు ఇంత కర్కశత్వంగా ఎలా వ్యవహరించగలిగారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణలో మరిన్ని విషయాలు వెలుగుచేసే అవకాశాలున్నాయనిభావిస్తున్నారు.

అత్తింటికి పయనమై.. అంతలోనే కన్నుమూసి

బస్సు ఢీకొనడంతో గాయాలపాలై మృతి

ద్రాక్షారామ, మే 12 (ఆంధ్రజ్యోతి): అత్తవారింటికి వెళ్తూ యువకుడు మృతిచెందిన సంఘటన కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ ఏనుగుబాయి తూము వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం హసన్‌బాదకు చెందిన పిల్లి గోపాలకృష్ణ (27) గొల్లపాలెంలో మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి గత నెల 22న కె.గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. సోమవారం ఉదయం అత్తింటికి వెళ్తుండగా ద్రాక్షారామ- యనాం రోడ్డులో యానాం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిన్నగా ఢీకొనడంతో గాయాలపాలై రోడ్డుపై పడ్డాడు. గోపాలకృష్ణను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న గోపాలకృష్ణ తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. వివాహం జరిగిన 20 రోజులకే మృతిచెందడంతో కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు.



గోపాలకృష్ణ (ఫైల్)

పెళ్లికి వెళ్తే ఇల్లు గుల్ల

ఇంటి తాళాలు బద్దలుకొట్టి చోరీ

రూ.9.80 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.8లక్షల నగదు మాయం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు తెరచి రూ.8 లక్షల విలువైన బంగారు వస్తువులు, నగదు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 11న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట పెళ్లికి పందలపర్రు వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామాన్లన్నీ చిందరవందరగా పడవేసి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.9.80 లక్షల విలువైన 8 కాసుల బంగారు వస్తువులు, 250 గ్రాముల వెండి వస్తువులు, రూ.8లక్షల నగదు దొంగిలించుకుపోయారని పేర్కొన్నాడు. సమాచారం తెలిసిన వెంటనే ఇంచార్జి డీఎస్పీ కె.సత్యనారాయణ, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్రైం సీఐ శ్రీధర్, క్లూస్ టీము, క్రైం టీములను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. నాగిరెడ్డి సత్తిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న స్వామినాయుడు

మోతుగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయనకు లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, డీఈటీ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వాసుదేవరావు కడప ఆర్టీపీపీకి బదిలీ అయ్యారు. వాసుదేవరావు నుంచి స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (టీఎన్‌వీకేఎస్) యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జాజుల రత్నాకర్ మూర్తి, లక్ష్మణ్‌కిరణ్, జెన్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతి కేసులో రూ.5లక్షల పరిహారం

జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో ఏపీ ప్రభుత్వం జీవో జారీ

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో నాలుగేళ్ల క్రితం మృతి చెందిన ఖైదీ కేసులో అతడి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేయగా.. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుత ఏఎస్ఆర్ పాడేరు జిల్లాకు చెందిన కళ్యాణం వెంకన్న(32) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండు ఖైదీగా వచ్చాడు. 2021 మే 4న అతడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పలు విచారణలు పరిశీలించిన ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల 2024 మార్చి 21న ఆదేశాలు జారీ చేసింది. వాటిని పరిగణనలోకి తీసుకుంటూ వెంకన్న కుటుంబీకులకు రూ.5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐడియా సో (ఫ్రె) ఫిష్!



ఉపాయం ఉండాలే గానీ ఉపయోగపడని దంటూ ఏదీ ఉండదని పెద్దలు చెబుతుంటారు. ఈ ఫొటోను చూస్తే ఆ మాటలను నిజమే అనిపించక మానదు. పాడైపోయిన ఫ్రిజ్‌లు పాడైతే కొన్నాళ్లు మూలన ఉంచి తర్వాత పాత సామాన్ల వాడికి అమ్మేయడం, చేస్తుంటారు. అయితే అలాంటి ఫ్రిజ్‌లను కూడా అక్వేరియంగా ఉపయోగించుకుంటే ఇలా ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ మార్కెట్‌లో చేపల వ్యాపారులు పాడైపోయిన ఫ్రిజ్‌లలో అరలు, డోరును తీసేసి ఇదిగో ఇలా పడుకోబెట్టి నీళ్లు పోసి చేపలను వేస్తున్నారు. వాటికి ఆక్సిజన్ అందడానికి యాభై రూపాయలతో చిన్న యంత్రాన్ని పెడుతున్నారు. దీంతో చేపలు తాజాదనంతో పాటు ఎక్కువసేపు బతికి ఉంటున్నాయి. వీటిని చూసిన జనం. ఈ ఫ్రెస్ ఐడియా బాగుందే అనుకుంటున్నారు.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

మండేన్



ప్రచండభానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోయారు. సోమవారం రాజమహేంద్రవరంలో అత్యధికంగా 43 డిగ్రీలు, కాకినాడలో 38 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో పలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి.



రాజమహేంద్రవరంలో నిర్మానుష్యంగా పుష్కర్‌ఘాట్ రోడ్డు





రాజమహేంద్రిలో ఎండ దెబ్బ తగలకుండా ఏర్పాట్లు



కాకినాడలో ఎండలో ప్రజల పాట్లు

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

అగ్నికుల క్షత్రియ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం



సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఇందిర, నాయకులు

ధవళేశ్వరం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చదువులో ప్రతిభ కనబరిచిన అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ప్రోత్సాకాలు ఇవ్వాలని జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. స్థానిక మచ్చ సూర్యనారాయణ ప్రాంగణంలో నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం మహాజన సభకు మాజీ ఎమ్మెల్సీ బలసాలి ఇందిర ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆంధ్రా యూనివర్శిటీ మెంబర్ దాసరి సత్యానందం, సత్యం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ కళాశాల డైరెక్టర్ ఎ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో సంఘాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఇటీవల ఎంఎస్ఈ జెనిటిక్స్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ సాధించిన సురేఖ అర్వాలమ్మను ఘనంగా సత్కరించారు. అలాగే బీఎస్సీ ఆక్వా కల్చర్‌లో 97శాతం మార్కులు సాధించిన ధర్మాడి సౌమ్యను, ఇంటర్మీడియట్‌లో 942మార్కులు సాధించిన జగతాని సాయిదుర్గను సత్కరించారు. ఈ సందర్భంగా దాసరి సత్యానందం మాట్లాడుతూ ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన సాయిదుర్గను ఉన్నత చదువులు చదివించడానికి దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షులు బలసాలి సత్యాగ్రహ రాజు, చెక్కా తాతారావు, అధ్యక్షుడు పొన్నమండ వీరకుమార్, యర్రా శివకుమార్, బొడ్డపల్లి నాగేశ్వరరావు, కామాడి సుబ్బారాజు, మచ్చ చల్లారావు, మల్లాడి గణేశ్వరరావు, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

కడియపులంకలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కడియపులంక జడ్పీ హైస్కూల్ 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కడియం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. బుర్రిలంక పీఎస్ఎం కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి 80 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లో ఆనాటి అల్లరి చేష్టలను, మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. తమ విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు సాయిబాబు, నాగకుమారి, సిరియా బేగం, శ్రీనివాస్, జోషిలతోపాటు అటెండర్ రమణమ్మను సత్కరించారు. ఈ సమ్మేళనానికి కూసి శ్రీనివాసరావు, కర్రి గంగారావు, పేకేటి కేదారేశ్వరుడు, చౌదళ్ళ వెంకటేశ్వరరావు, గట్టి వేంకటేశ్వరస్వామి, కరిబండి దుర్గారాజేష్, గాద గీతాప్రసాద్, గ్రంధి అప్పా రావు, తానంకి కృష్ణవేణి, తల్తిరి వెంకటనాగలక్ష్మి కృషి చేశారు.

2 కిలోల గంజాయి పట్టివేత

రాజమహేంద్రవరం సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణమఠం వెనుక వీధిలో గంజాయితో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక సిద్ధార్థనగర్‌కు చెందిన కొల్లిపాక దేవ 2 కిలోల గంజాయిని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సాయికి స్థానిక కోరుకొండ రోడ్డులోని రామకృష్ణమఠం వెనుక ప్రాంతంలో ఇస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దేవాను పట్టుకున్నారు. సాయి పరారయ్యాడు. నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నిడదవోలు, మే 12(ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. నిడదవోలు మండలం తాడిమళ్లలో పంతగాని వెంకటశ్రీను, విమలకుమారి(40) దంపతులు నివాసం ఉంటున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ ఆదివారం రాత్రి భార్య విమలకుమారి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులకు విషయం తెలియడంతో సోమవారం చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముంపు నివారణకు చర్యలు



పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

» ఎప్పటికప్పుడు పూడికతీతలు
» పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టు నగరంలో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్‌తో డ్రైనేజీల పూడిక తీత పనులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించారు. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీలు, కాలువల్లో పూడిక తీత పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద కాలువ, తెలుకల వాని చెరువు వద్ద డ్రైనేజీ, 21వ డివిజన్‌లో గోదావరి గట్టున ప్రాంతంలోని కాలువ, తుమ్మలావ కృష్ణనగర్ సమీపంలో కాలువ, వీవీ గార్డెన్స్ ఏబీ నాగేశ్వరరావు పార్కు వద్ద కాలువ, ఎస్ఆర్‌సీపీ వద్ద కాలువల్లో సిల్ట్ తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు వర్షాకాలంలో రెయిన్ కోట్లు, అవసరమైన ఇతర వస్తువులు ఇవ్వాలని ఆదేశించారు.

పూడిక తీత పరిశీలించిన కమిషనర్

తాడితోట, ఆవరోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీల్లో పూడిక తీత పనులను మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, వర్షాకాలం ప్రధాన డ్రైనేజీల గుండా వర్షపు నీరు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు.

ప్రపంచ మాతృ దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): కళాదృష్టి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యాపురం డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు మెమోరియల్ పార్కు గ్రంథాలయంలో సంస్థ అధినేత ఎ.కృష్ణ దత్తాత్రేయ శర్మ అధ్యక్షతన ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. సృష్టికి మూలమైన మాతృమూర్తి గొప్పదనాన్ని, ప్రాధాన్యాన్ని తెలియజేసే కవితలు, పాటలతో అలరించారు.

డొక్కా సీతమ్మ జీవిత కథ ఆధారంగా

త్వరలో సినిమా

రాజమహేంద్రవరం కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి: ఆంధ్ర అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మ జీవిత కథ ఆధారంగా భారీ తారాగణంతో, భారీ బడ్జెట్‌తో శ్రీశ్రీ సత్యదేవ ప్రొడక్షన్ నెం.1 పేరిట గోదావరి తీరంలో జూన్ మొదటి వారం నుంచి ప్రారంభిస్తున్నామని ప్రొడ్యూసర్ పోతి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. రచయిత మురళీ రమేష్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ నివాస స్థలాన్ని సందర్శించి, వారి బంధువులు, గ్రామ ప్రజల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించి వాస్తవ గాథను తెరకెక్కిస్తున్నామన్నారు. తారాగణం ఎంపిక జరిగిందని, జూన్ నెలలో గోదావరి మాగాణీలోనే షూటింగ్ అంతా ఉంటుందన్నారు. డైరెక్టర్ చిరువోలు మురళీ మాట్లాడుతూ డైరెక్షన్‌లో గతానుభవంతో తొలి చిత్రాన్ని తీయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

'శాంతిభద్రతలు కరువు'

రాజమహేంద్రవరం కల్చరల్ మే12(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, కక్ష సాధింపు చర్యలు మితిమీరిపోయాయని వైసీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు.స్థానిక ప్రకాశంనగర్‌లోని తన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి విడదల రజని విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు శోచనీయమని, ఫిర్యాదు రిజిస్టర్ కూడా చేయకుండానే ఎక్కడుంటే అక్కడికెళ్లి వాళ్లను లాక్కుని వచ్చే విధంగా ప్రవర్తించడం దారుణమన్నారు.

వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

» మరమ్మతుకు గురైన వాటిని వారంలో అందుబాటులోకి తేవాలి
» వెహికల్ యార్డ్ తనిఖీలో కమిషనర్



వెహికల్ యార్డ్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. సోమవారం స్థానిక క్వారీ సెంటర్ సమీపంలోని కార్పొరేషన్ వెహికల్ యార్డ్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. మూవ్‌మెంట్ రిజిస్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఎన్ని వాహనాలు ఉన్నాయి, ఎన్ని వినియోగంలో ఉన్నాయి. ఎంతమంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. ఎంతమంది అందుబాటులో ఉన్నారో ఆరా తీశారు. వాహనాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంపై ప్రశ్నించారు. పాడైన వాహనాలకు మరమ్మతులు వేగంగా చేయించి, వారంలోపు రన్నింగ్‌లోకి తీసుకురావాలని యార్డ్ ఇన్‌చార్జిలు, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఈఈ రీటా, శానిటర్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

అన్ని అర్జీలు ప్రధానమైనవే

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందించిన ప్రతీ అర్జీ ప్రధానమైనదేనని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన నగర ప్రజల నుంచి 29 అర్జీలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సోమవారం వచ్చిన అర్జీలు శనివారం నాటికి క్లోజ్ అయ్యేలా ఆయా విభాగాల హెచ్‌వోడీలు చొరవ చూపాలన్నారు. అందినప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎన్ని రోజుల్లో పరిష్కారం చూపేది రసీదు ఇస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు.

అధికారుల తీరుతో విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం

ఉపాధ్యాయుల ధర్నాలో యూటీఎఫ్ నాయకురాలు అరుణకుమారి.. డీఈవోకు వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు ప్రతివారం గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమస్యలపై చర్చిస్తున్నప్పటికీ వాటిని ఖాతరు చేయడంలేదని, అధికారుల నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ తీవ్ర నష్టాన్ని చవిచూసే ప్రమాదం ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అన్నారు. సోమవారం స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు ధర్నా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.జయకర్, ఏ.షరీఫ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 విద్యావ్యవస్థను అతలాకుతలం చేసిందని, దానిని రద్దు చేస్తామని చెప్పిన కూటమి కూడా గత ప్రభుత్వం బాటలోనే నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ధర్నా అనంతరం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కే.విజయ్‌గౌరీ, ఈవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీమణి, దయానిధి, రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, రమణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ ప్యాకేజీ స్టార్ : ఏపీ ఎమ్మార్పీఎస్

వచ్చేనెల 5న రౌండ్ టేబుల్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కేటాయింపులో రోస్టర్ పాయింట్‌లో మాలలకు 8శాతం, మాదిగలకు 6శాతం, ఉపకులాలకు 1శాతం కేటాయించారని ఇది దారుణమన్నారు. దీనిపై మంద కృష్ణ మాదిగ కూడా స్పందిచలేదని, ఆయన ప్యాకేజీ స్టార్‌గా మారిపోయి మాదిగలకు అన్యాయం చేశాడని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణంలో మాదిగల కేటాయింపు శాతం 13కు పెంచమని అడిగిన మంద కృష్ణ ఏపీలో ఎందుకు స్పదించడంలేదన్నారు. అతను మాదిగలకు ద్రోహం చేస్తున్నాడని ఆరోపించారు. సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి మాదిగలకు 7శాతం, మాలలకు 7శాతం ఉపకులలకు 1శాతం కేటాయింపులు చేయాలని ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులో కూడా ఎస్సీ వర్గీకరణ ప్రకారమే కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసారు. దీనిపై అమరావతిలో వచ్చేనెల 5న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కేటాయింపులపై భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బలంకుల రాజు, ముప్పిడి ప్రేమ్‌కుమార్, మోర్త సాయి, ఎలమర్తి శేఖర్, ఎలమర్తి దుర్గ, మారుతి కుమార్, చెవిటి ఏసు, ఏడిద సునీల్, పెదపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

చైర్మన్లకు అభినందనలు

అనపర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన పలు కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించిన వారికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కెఎస్ జవహర్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి నియమితులైన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. యూటీఎఫ్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ ఉచిత అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు అవగాహన సదస్సును ఉదయం ప్రారంభిస్తారని తెలిపారు. సైకాలజీకి సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తారని వారు పేర్కొన్నారు.



నర్సులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

'నర్సుల సేవలు కీలకం'

జీజీహెచ్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నర్సుల సేవలు కీలకమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మాతా, శిశు విభాగం వద్ద ఉన్న ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి ఆయన పుష్పమాల వేశారు.ఈఎన్‌టీ సెమినార్ హాలులో జరిగిన కార్య క్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌సం ద్వారా జీని సూపరింటెండెంట్ సత్కరించారు.హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ సుధాకరరెడ్డి

కాలువల మరమ్మతులపై దృష్టిసారించాలి

ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ సుధాకరరెడ్డి

అనపర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): కాలువల మరమ్మతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అన్నా రు. సోమవారం బిక్కవోలులోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు, నీటి సంఘాల ప్రతినిధుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా అనపర్తి డీసీ పరిధిలో చేపట్టాల్సిన పనులను నీటి సంఘాల ప్రతినిధులు అధికారులకు తెలిపారు. ముఖ్యంగా 45 పనులను చేపట్టాల్సి ఉందని కాకినాడ డీఈఈ ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో చాలా వరకు ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపించామని మంజూరు రావాల్సి ఉందని అన్నారు. వేమగిరి నుంచి జీ మేడపాడు వరకు సామర్లకోట కెనాల్‌లో వెలసిన ఆక్రమణల తొలగింపును ప్రతినిధులు లేవనెత్తారు. దీంతో డీఈఈ మాట్లాడుతూ ఆక్రమణల తొలగించే అధికారం రెవెన్యూకు మాత్రమే ఉందన్నారు. అనంతరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ అనపర్తిలోని చానల్ 3లో కనీస మరమ్మతులు లేకపోవడంతో షట్టర్లు మెరాయించాయని వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బిక్కవోలు సెక్షన్ ఏఈ షైనీ. డ్రైనేజీ ఏఈ కీర్తి, అనపర్తి, కడియం, బలభద్రపురం, బిక్కవోలు, జీ.మేడపాడు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రతి మండల కేంద్రంలో సప్తాహ భజనలు జరగాలి

రంగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక సంక్షేమం కోసం ప్రతీ మండల కేంద్రంలో సప్తాహ భజనలు జరగాలని వేట్లపాలెం భజన గురువు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు కోరారు. సోమవారం రంగంపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి బాలభక్త సంఘం గౌరవ అధ్యక్షుడు పోతుల వీరసుందరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నమాచార్య జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం నాగేశ్వరరావు మాస్టార్‌ని ఆయా గ్రామాల భజన సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పోతుల చిన్నికాపు, బలిరెడ్డి దుర్గారావు తదితరులతో పాటు రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, వేట్లపాలెం తదితర గ్రామాల భజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రంగంపేటలో నాగేశ్వరరావు మాస్టార్‌ని సత్కరిస్తున్న వడిశలేరు భజన సంఘ సభ్యులు

మనో వికాసానికి గ్రంథాలయాలు దోహదం

రంగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మనో వికాసానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని రంగంపేట గ్రంథాలయాధికారి ఎన్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రంగంపేట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులతో ఇంగ్లీష్ లెటర్ 'ఏ'తో కార్టూన్‌లు గీయించారు. ముందుగా విద్యార్థులతో సరస్వతీ దేవి ప్రార్థన చేయించి, అక్బర్ బీర్బల్ నీతికథలను బోధించారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి భవిష్యత్తుకు బంగారు బాటలు ఏర్పరచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉండవిల్లి గంగాధరం, వజ్రపు వెంకటరమణ విద్యార్థులకు బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రంగంపేటలో కార్టూన్ బొమ్మలు వేసిన విద్యార్థులు

ఈపీఎస్ పింఛన్‌ను

రూ.7500కి పెంచాలి

దివాన్‌చెరువు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఈపీఎస్ నెలకు రూ.7,500 చెల్లించాలని టీఎన్‌టీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు కాదా ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈపీఎఫ్‌ఓలో సభ్యులుగా ఉన్న ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులు కనీస పెన్షన్‌ను పెంచాలని ఎంతో కాలంగా కోరుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి సానుకూలమైన ప్రకటన రాకపోవడంతో వారంతా అసంతృప్తికి గురవుతున్నారని చెప్పారు. పింఛనుదారులు కోరుతున్న విధంగా కనీస పింఛన్‌ను రూ.7,500కు పెంచుతూ ప్రభుత్వం వెంటనే ప్రకటన చేసి తక్షణం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

కాళీకృష్ణ కల్యాణోత్సవం

రాజానగరం, మే 12 (ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో సోమవారం కాళీ కృష్ణ కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు హాజరై స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గోకవరం, రాజానగ రం, బీజేపీ మండలాధ్యక్షులు ఇనకోటి బాపన్నదొర, ఆళ్ల శివనాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా గో వృషభ కల్యాణం



గోమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రాజానగరం, మే 12 (ఆంధ్రజ్యోతి): చక్రద్వారబంధంలో సోమవారం గోవృషభ కల్యాణం భక్తుల గోవింద నామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన ముత్యం హరేరామకృష్ణ (శ్రీను), రఘుదుర్గ దంపతులతో ఉదయం మండపారాధన, గణపతి హోమం, అనంతరం వైశాఖ శుద్ధ పూర్ణిమ విశాఖ నక్షత్రయుక్త మిధున లగ్నంలో ఉదయం 9.28 గంటలకు గో వృషభ కల్యాణ క్రతువును గ్రామ పురోహితులు భవానీభట్ల శ్రీకాంత్ శర్మ బ్రహ్మత్వంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆంబోతుకు అచ్చువేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటుగా పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీటీఎఫ్ ధర్నా విజయవంతం చేయాలి

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా సమస్యలపై ఈ నెల 14న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. సోమవారం కొవ్వూరులోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. విద్యారంగంలో సంస్కరణల పేరుతో జీవో 117తో ప్రయోగాలు శోచనీయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి సువర్ణరాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం ఇద్దరు ఎస్‌జీటీలు ఉండాలన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ షేక్ సలీం మాట్లాడుతూ 12పే రివిజన్ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 కరువుభత్యాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ జానీ, పి.గంగరాజు, వై.శంకరం, కనకదుర్గ, విష్ణు, అనితాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల ఫిర్యాదుకు టోల్ ఫ్రీ 1100



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరు 1100కు ఫోన్ ద్వారా అర్జీలు అందించవచ్చునని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆమె 9 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వ్యయప్రయాసలకు గురై ఆర్డీవో కార్యాలయానికి రానవసరం లేదని, ప్రతి సోమవారం మండల తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయాలలో మండలస్థాయిలో అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో అధికారులు తప్పనిసరిగా ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.రవివిక్రమ్, వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్ స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించండి

నల్లజర్ల, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరుకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్‌ను ఎటు వంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు తొలగించారని, పునరుద్ధరించి న్యాయం చేయాలని మండలంలోని పుల్లలపాడులో గ్రామా నికి చెందిన రైతు కనికెళ్ల పేరయ్య అధికారులకు అర్జీ అందజేశాడు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సింహాద్రిరావు సోమ వారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పేరయ్య ఈ మేరకు అర్జీ అందజేశాడు. సర్వే నెంబరు 876-2లో తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో మార్చి నెలలో రెవెన్యూ అధి కారుల అనుమతితో విద్యుత్ అధికారుల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్ పొందానన్నాడు. అయితే పది రోజులకే కనెక్షన్ విద్యుత్ అధికారులు తొలగించారని, దీనిపై వారిని ప్రశ్నించగా పక్క రైతు బోరుకు 90మీటర్ల దూరం మాత్రమే ఉందని, ఆ రైతు ఫిర్యాదు మేరకు తొలగించినట్టు చెప్పారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు కొలతలు వేసిననప్పుడు 136 మీటర్ల దూరం ఉండడంతో తమకు అనుమతులు ఇచ్చారని, కనెక్షన్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని రైతు అధికారులను కోరుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రం, ఎంపీటీసీ వేగి ప్రతాప్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	:శుభం
సూర్యమినీ	: సారంగపాణి జాతకం
సూర్యప్యాలస్	:తుడరుమ్
స్వామి	:హిట్-3
శివజ్యోతి	:హిట్-3
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఓదెలా-2
రాజా	:హిట్-3
ఊర్వశి	: జగదేక వీరుడు అతిలోక సుందరి
రంభ	: 6 జర్నీ, కామన్ మ్యాన్ పెళ్లాం
మేనక	: అర్జున్ S/O వైజయంతి
అప్సర	:సింగిల్
కుమారి	:సింగిల్
అశోక	:రెట్రో
వీఎస్ మహల్(నామవరం)	:హిట్-3
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సింగిల్
వెంకటసూర్య(కడియం)	:హిట్-3
సత్యగౌరి (అనపర్తి)	: సింగిల్
సూర్యశ్రీ (అనపర్తి)	:హిట్-3
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: హిట్-3
రామకృష్ణ(కోరుకొండ)	: ----
గీతాసినిమాస్ (సీతానగరం)	: హిట్-3
శ్రీనివాస (గోకవరం)	: సింగిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: హిట్-3
లలితామహల్(రంపచోడవరం)	: హిట్-3
నవయుగ(చింతూరు)	: ----



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0 (సోమవారం)
కనిష్ఠం : 27.0



నిర్లక్ష్యంగా పనిచేస్తే.. జీతాలు ఆపండి

- ఇక ప్రతి శనివారం హౌసింగ్‌డే
- కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

రాజమహేంద్రవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ పనుల వేగవంతానికి కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వివిధ అంశాలపై ఆమె సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో అదనపు రుణ సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారులతో మమేకం కావాలన్నారు. గృహ నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి జీతాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు.ఉపాధి హామీ పథకం కింద ఫామ్ పాండ్‌లను వర్షాకాలం వచ్చేలోపుగా పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు అండగా నిలిచే క్రమంలో జిల్లాకు ఈ ఖరీఫ్ సీజన్‌కు 1.10 లక్షల సీసీఆర్సీ కార్డులు లక్ష్యంగా ఇచ్చా రన్నారు.ఈ-క్రాప్ బుకింగ్, అడంగల్‌ను అనుసరించి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను జారీ చేయాల్సి ఉంటుందని చెప్పారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో క్షేత్రస్థాయి అధి కారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ వీడియో కాన్ఫ రెన్స్‌కు హాజరుపై ఆర్డీవోలు నిర్ధారణ చేసుకోవాలన్నారు.ఎవరైనా తహశీల్దార్ పనితీరులో అలసత్వంగా ఉంటే సంబంధిత ఆర్డీవో బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రీ సర్వే, స్వామిత్ర సర్వే పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పా టించాలన్నారు. రబీ ధాన్యం లక్ష్యాలు పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



స్కిల్ డెవలప్‌మెంట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చిత్రంలో యువత

నేర్చుకుంటామంటే.. వచ్చేస్తోంది!

రాజమహేంద్రవరంలో మొబైల్ ట్రైనింగ్ వాహనం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్య ర్థుల వద్దకే వెళ్లి స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చు ట్టిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడి వాసు అన్నారు. నేషనల్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన సౌరశక్తి ఆధారిత మొబైల్ ట్రైనింగ్ వాహనాన్ని అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అనిల్, టీడీపీ నాయకులతో కలిసి సోమవారం మోరంపూ డిలో ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దక్షిణ భారత దేశంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఒకే ఒక్క వాహనం రాజమహేంద్రవరంలో తొలిసారిగా ప్రారంభించడం ఆనందంగా ఉంద న్నారు.ఈ వాహనంలో స్కిల్ డవలప్‌మెంట్‌కు సంబంధించి 12 అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ మొబైల్ వాహనం యువత వద్దకే వెళ్లి శిక్షణ ఇస్తుందన్నారు. భవానీ చారిటబుల్ ట్రస్ట్,అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో యువత రూ.50 వేలు ఖర్చుపెట్టుకుని నేర్చుకునే కోర్సును ఉచి తంగా నేర్పించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



టెంపుల్‌గా.. పెట్టండి!

భక్తజన..భోజనంబు

తిరుపతిలో తినలేకపోతున్నాం.. గత ప్రభుత్వంలో ఇదీ భక్తుల మాట.. ప్రభుత్వం మారింది.. అంతే అన్నదానం అమృతమయంగా మారింది. సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతిలో అన్నదాన ప్రసాదాన్ని అమోఘంగా మార్చారు. నాణ్యతగా ఉండేలా చూస్తున్నారు.. ఒక్క తిరుపతిలోనే కాదు.. జిల్లాల్లోని ప్రధాన ఆలయాల్లోనూ నిత్యాన్నదానం చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు ఆలయాల్లో నిత్యాన్నదానం చేయాలని ఆదేశించారు. అందులో ఒకటి అన్నవరం.. రెండోది వాడపల్లి. అలాగే తలుపులమ్మ లోవ ఆలయంపై నివేదికివ్వాలని సూచించారు. సీఎం ఆదేశాల అమలుకు అధికారులు పరుగులు పెడుతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులకు పరిమితి లేకుండా నిత్యాన్నదానం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ కడుపునిండా భోజనం వడ్డించాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం చంద్రబాబు ఇటీవల దేవదాయశాఖపై సమీక్ష సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో నిరంతరం భక్తులకు నిత్యాన్నదానం అందుతున్నా ఇకపై మరింతమందికి భోజనం అందించేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. అన్నవరం దేవస్థానానికి నిధుల కొరత వేధిస్తుండడం, భోజనశాలలు ఏమాత్రం సరిపోకపోవడంతో దీన్ని ఎలా అమలుచేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. వాడపల్లికి నిధులు పుష్కలంగా ఉండడంతో పరిమితి లేకుండా మరింత మందికి అన్నదానం అమలుచేయనున్నారు. తుని నియోజవర్గంలోని తలుపులమ్మ లోవ ఆలయంలో నిత్యాన్నదానం అసలు ఇంతవరకు లేదు. దీంతో త్వరలో అమలుకు వీలుగా సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం నివేదిక కోరింది.

అన్నవరంలో తర్జనభర్జన..

సీఎం ఆదేశాలను తక్షణం అమలుచేసే విషయంలో అన్నవరం దేవస్థానం అధికారులు తల పట్టుకుంటున్నారు. అన్నప్రసాదం సంఖ్య పెరిగితే ఆర్థిక భారం ఎలా మోయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. 1987లో సత్యదేవా నిత్యన్నదాన ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ఈ ట్రస్ట్‌లో రూ.64 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిపై ఏటా రూ.4.5 కోట్లు వడ్డీ లభిస్తోంది. సాధారణ రోజుల్లో నాలుగు వేలు, శని, ఆదివారాల్లో 5 వేల నుంచి 6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. వడ్డన సిబ్బంది జీతభత్యాలతో కలిపితే ఒక్కో భోజనానికి దేవస్థానానికి రూ.34 వ్యయమవుతోంది. కార్తీకమాసం వంటి పుణ్యమాసాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని అందిస్తున్నారు. వీటి నిర్వహణకు ప్రస్తుతం లభిస్తున్న వడ్డీ డబ్బులు చాలీచాలనట్టుగా ఉన్నాయి. సీఎం చంద్రబాబుతో ప్రకటనతో పరిమితిలేని నిత్యాన్నదానం ఎలా అమలుచేయాలనేదానిపై ఆలయ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అన్నవరంలో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ చేయాలంటే సుమారు రోజుకు 10 వేల మందికి అందించాల్సి ఉంటుంది. పైగా దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న భోజన హాలు చిన్నగా ఉంది. దీంతో నూతన అన్నప్రసాద భవననిర్మాణం ప్రసాద్ స్కీంలో రూ.11.50 కోట్లతో మంజూరైంది. తీరా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరే సింహాచలం ఘటనలో నాసిరకం పనులతో దొరికిపోవడంతో ప్రభుత్వం అతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో అన్నవరం ప్రసాద్ స్కీం పనులు ఆగిపోయే పరిస్థితి తలెత్తింది. ఖర్చులన్నీ దేవదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అక్కడనుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా వ్యవహరిస్తామన్నారు.



వాడపల్లిలో ఓకే..

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి గడచిన కొన్నేళ్లుగా వేలల్లో భక్తులు పోటెత్తుతున్నారు. ఈమేరకు ఆల యంలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అపరిమిత అన్నదానం అమలు చేయాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో దీనికి తగ్గ సన్నాహాలను అధికారులు ఆరంభించారు. తుని నియోజకవర్గంలోని తలుపులమ్మ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ రద్దీ లెక్కలు సీఎం సమీక్షలో అధికారులు ప్రస్తావించారు. ఇక్కడ కూడా అన్నదానం అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ ఆలయంలో అసలు అన్నదానం అమలు కావడం లేదు. అన్నదానం అమలు సాధ్యాసాధ్యాలపై తలుపులమ్మ ఆలయ ఈవోను ప్రభుత్వం నివేదిక కోరింది. ఇక్కడకు ఆదివారం 10 వేల మంది వరకు భక్తులు వస్తారని.. మిగిలిన రోజుల్లో వెయ్యి మంది వరకు ఉంటారని అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. పైగా ఈ ఆలయానికి వచ్చే భక్తులు సొంతంగా ఇక్కడే వండుకుని తినే ఏర్పాట్లతో వస్తారని.. అన్నదానం అవశ్యకత తక్కువేనని తెలిపారు. అయితే లోవలో అన్నదానం అమలు చేయాలా? లేదా? అనేదానిపై ఈనెల 17న అమరావతిలో జరగనున్న సమీక్షలో స్పష్టత రానుంది. ఆలయాల్లో భక్తులకు అందుతున్న సేవలు, భోజన నాణ్యతపై తరచుగా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తోంది. ఏ మాత్రం నాణ్యతలో తేడా ఉందని ఫిర్యాదులు వచ్చినా ఆలయానికి ఇచ్చే పాయింట్లను తగ్గిస్తూ అధికారులను పరుగులు పెట్టిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారాక అనేక ఆలయాల్లో అన్న ప్రసాదంలో నాణ్యత రెట్టింపుకావడంతో భక్తులు ఆనందిస్తున్నారు.

భక్తుల కడుపు నింపండి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ఉభ య తెలుగు రాష్ట్రాల నుంచి వేలల్లో భక్తులు వస్తుంటారు. ఏటా కోట్లలో విరాళాలు అందు తున్నాయి. ప్రస్తుతం అన్నవరం,వాడపల్లి ఆల యాలకు వేలాదిగా వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.అన్నవరం కొండపై నిత్యం నాలుగు వేల మంది భక్తులకు నిత్యాన్నదానం అమలవుతోంది. వాడపల్లిలో శని,ఆదివారాల్లో 50 వేల వరకు, మిగిలిన రోజు ల్లో 10 వేల మంది వరకు భక్తులకు అన్నదానం అందుతోంది. ఈ రెండు ఆలయాలకు కొన్నేళ్లుగా భారీగా భక్తులు తరలివస్తోన్న నేపథ్యంలో మరింత మందికి పరిమితిలేని విధంగా అన్న దానం అందించాలని సీఎం చంద్రబాబు అధికా రులను ఆదే శించారు.ఈ నెల 6న అన్ని ఆలయాల ఈవోలతో అమరా వతిలో సమీక్షించిన సీఎం భక్తులకు ఇబ్బందిలేకుండా అన్న దానం అమలు చేయాలని ఆదేశించారు. దీంతో ఈ రెండు ఆలయాల్లో భక్తులకు మరింత మందికి అన్న ప్రసాదం అందనుంది.

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- అన్నవరం, వాడపల్లిలో అమలు
- ఇప్పటికే వేలాదిమందికి అన్నదానం
- మరింత పెంచేందుకు సన్నాహాలు
- అన్నవరంలో నిధుల కొరత
- వాడపల్లిలో అన్నదానానికి ఓకే
- తలుపులమ్మ లోవపై నివేదిక
- 17న అమరావతిలో సమీక్ష

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 259 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం,మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు నిర్వహించారు. మొదటి ఏడాది 3187 మంది విద్యార్థులకు 3 వేలు, రెండో ఏడాది 298కి 250 మంది హాజరయ్యారని ఆర్ఐవో నరసింహం తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 34 మంది మొత్తం 259 మంది గైర్హాజరయ్యారన్నారు.

మాజీ ఎంపీ భరత్‌పై పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రతిష్ఠను దిగజార్చే విధంగా అసత్య ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజుకు సోమవారం ఫిర్యాదు అందజేశారు.కూటమి ప్రభుత్వం వచ్చాక స్పా సెంటర్లలో ఎలాంటి తప్పు జరిగినా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముడిపెట్టి దానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. టీడీపీపై బురద జల్లాలనే దురు ద్దేశంతో భరత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.ఈ కార్య క్రమంలో టీడీపీ పార్లమెంటు కమిటీ ఉ పాధ్యక్షుడు మజ్జి రాంబాబు,లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక స్టాక్ పాయింట్లు

రాజమహేంద్రవరం/కొవ్వూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణిసుస్మిత తెలిపారు.ధవళేశ్వరం, కొవ్వూరు మండలం చిడిపి, కుమారదేవం 12 ఇసుక యార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజమహేంద్రవరం డివి జన్‌లోఇప్పటి వరకూ 1.08 లక్షల టన్నుల ఇసుకను స్టాక్ యార్డులో నిల్వ ఉంచామన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 77,196 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు.

రోడ్డెక్కిన అన్నదాత

- జాతీయ రహదారిపై బైఠాయింపు
- రెండున్నర గంటల పాటు నిరసన
- అధికారుల హామీతో విరమణ


జాతీయ రహదారిపై బైఠాయించి రైతుల నిరసన ప్రదర్శన


కొవ్వూరు - గుండుగొలను జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్


డీఎం రాధికను టార్గెట్‌పై ప్రశ్నిస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు రోడ్డెక్కారు.. పండించిన పంటను కొనుగోలు చేయాలంటూ భీష్మించారు. అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకూ విరమించేదిలేదని సుమారు రెండున్నర గంటల పాటు రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు.కొవ్వూరు నియోజకవర్గంలో 1,13,090 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ఇప్పటి వరకు 78,731 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకనూ 13,787 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయవలసి ఉంది. ఇప్పటికే లక్ష్యం పూర్తయిందని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయడంలేదు. ఒక పక్క పంట చేతికొచ్చినా మరో వైపు కొనుగోళ్లకు అవకాశం లేకపోవడంతో రైతులంతా కలిసి ఆందోళనకు దిగారు.కొవ్వూరు, గుండుగొలను నేషనల్ హైవేపై గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో దొమ్మేరు వైపు ధాన్యం బస్తాలు లోడ్‌చేసుకుని వచ్చిన ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఎండను సైతం లెక్క చేయకుండా రోడ్డుపై బైఠాయించి సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. హైవేపై రెండు వైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె. విజయబాబు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏవో ఎ.గంగాధర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి రోడ్డుకు అడ్డంగా పెట్టిన ధాన్యం ట్రాక్టర్లను తొలగించాలని కోరారు. అయినా మాట వినకపోవడంతో పోలీసులు బలవంతంగా రైతులను తొలగించే ప్రయత్నం చేశారు. అయినా రైతులు తగ్గలేదు. సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదని పట్టుబట్టారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో గత పంట కంటే 70 శాతం అధికంగా కొనుగోలు చేశారని, కొవ్వూరు డివిజన్‌లో తక్కువ టార్గెట్లు ఇచ్చారన్నారు. ప్రస్తుత పంటలో అధిక దిగుబడులు వచ్చాయని పాత లెక్కల ప్రకారం కొనుగోలు చేస్తే ఎలా అని ఆర్డీవోను ప్రశ్నించారు. వాడపల్లికి చెందిన రైతు స్వామి మాట్లాడుతూ వెంటనే టార్గెట్లను పెంపుదల చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన రైతు సుబ్బారావు మాట్లాడుతూ ఒక ప్రక్క వర్షాలు పడుతున్నాయి ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. నందమూరుకు చెందిన మారిన రామకృష్ణ మాట్లాడుతూ వెంటనే ఆర్‌ఎస్‌కేల టార్గెట్లు పెంచి పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అదే సమయంలో అటుగా వెళుతున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ రైతులను చూసి కారు దిగి వచ్చారు. విషయం తెలుసుకుని ఆర్డీవో రాణి సుస్మిత, జేసీ ఎస్.చిన్నరాముడు, సివిల్ సప్లయిస్ డీఎం రాధికలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు.ఈ మేరకు రైతులు ఆందోళన విరమించారు. ఆందోళనలో కొవ్వూరు, చాగల్లు మండలాల రైతులు పాల్గొన్నారు.


పీజీఆర్ఎస్‌లో నేరుగా ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌లో 159 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరంరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల కేంద్రంలో పాలన కొనసాగాలనే ఉద్దేశంతో పాలనా ప్రక్రియలో ప్రజలకు ప్రథమస్థానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర సంకల్పం అనే కార్యక్రమాన్ని చేపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 159 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో చొరవచూపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 24గంటల్లో పరిష్కరించాల్సినవి 5, 48 గంటల్లో పరిష్కరించాల్సినవి 35 , 72 గంటల్లో పరిష్కరించాల్సినవి 16 అర్జీలు ఉన్నట్టు చెప్పారు. రీ ఓపెన్‌చేసినవి 137 ఉన్నాయన్నారు. స్వర్ణ ఆంధ్ర సంకల్పం కార్యక్రమానికి సంబంధించి సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు.దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో వాస్తవాలని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి సీనియర్ అఖిల భారత సర్వీస్ అధికారులు ఎంపిక చేసిన గ్రామాల్లో మూడు రోజులు పర్యటిస్తారని తెలిపారు. ఈ పర్యటనల్లో వారు నేరుగా ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) సుబ్బరాజు

డీపీవోలో గ్రీవెన్స్‌కి 34 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాయలంలో సోమవారం ఏర్పాటు చేసిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో 34 మంది ఫిర్యాదులను అందజేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం.మురళీ కృష్ణ(పరిపాలన), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు) మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.చట్ట పరిధిలో త్వరితగతిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భానుడి మంట.. వరుణుడి ఆట!


పిడుగుపాటుకు మృత్యువాత


మాతంగమ్మ మెట్ట వద్ద చెట్టు కూలిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్

- రాజమండ్రిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఒక్కసారిగా మారిన వాతావరణం
- పిడుగు పాటుకు 4 దూడలు మృత్యువాత

గోపాలపురం,మే 12 (ఆంధ్రజ్యోతి) :ఈ ఏడాది వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కావడంలేదు.. అప్పుడే ఎండ మండిపోతోంది..ఆ మరుక్షణమే చినుకులు పడుతున్నాయి..ఎప్పుడు ఎండ కాస్తుందో.. ఎప్పుడు వానపడుతుందో తెలియడంలేదు.. సోమవారం భానుడు మండిపడ్డాడు.. బయటకు రావాలంటేనే జనం భయపడిపోయారు.వేడిగాలులు తాళలేక అల్లాడిపోయారు. ఎందుకంటే రాజమహేంద్రవరంలో 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు విపరీతమైన ఎండ కారణంగా ఇళ్లకే జనాలు పరిమితమయ్యారు.సుమారు 4 గంటల సమయంలో ఆకాశంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది.. కాస్త చల్లబడింది.. గోపాలపురంలో కారుమబ్బు లు కమ్మి ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూ డిన వర్షం కురిసింది. దీంతో మాతంగమ్మ మెట్ట వద్ద ఈదురు గాలుల కారణంగా చెట్లువిరిగి జాతీ యరహదారిపై పడడంతో గోపాల పురం నుంచి జగన్నాథపురం వరకు సుమారు 6 కిలోమీటర్ల మేరా జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయా యి. ఇదిలా ఉంటే పెద్దగూడెంకు చెందిన అక్కాబత్తుల పెదవెంకటేశ్‌కు చెందిన నాలుగు గేదె దూడలు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి.కనీసం రూ.70 వేల వరకు ఉంటుందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం

● ఎమ్మెల్సీ సోము వీర్రాజు ● ఉండ్రాజవరంలో బుద్ధపూర్ణిమ పూజలు


బుద్ధ పూర్ణిమ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సోము

ఉండ్రాజవరం, మే 12(ఆంధ్రజ్యోతి): బుద్ధుడి బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సోమవారం ఉండ్రాజవరంలోని బౌద్ధదమ్మ పీఠంలో వైశాఖ బుద్ధ పూర్ణిమ సందర్భంగా పీఠాధిపతి అనాలయో ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి వీర్రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. బుద్ధుడి బోధనలతో ప్రజలను చైతన్యపరచడం, విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలు, తరగతులు నిర్వహించడం, నేత్ర, దంత వైద్య సేవలందించడం పట్ల అనాలయోను అభినందించారు. అనాలయో మాట్లాడుతూ సిద్ధార్థుడి జననం, బుద్ధుడిగా అవతారం, మహా భినిష్క్రమణం ఒకే రోజు కావడంతో ప్రతి ఏటా వైశాఖ బుద్ధ పూర్ణిమ రోజు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం 100మందికి ఒక్కొక్కరికి రూ.3వేలు విలువైన నిత్యావసర కిట్‌లను, 50మందికి రూ.1వెయ్యి చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు ఏపీటీఎఫ్ ధర్నా విజయవంతం చేయాలి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 14న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. సోమవారం కొవ్వూరులోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. విద్యారంగంలో సంస్కరణల పేరుతో జీవో 117తో ప్రయోగాలు శోచనీయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి సువర్ణరాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం ఇద్దరు ఎస్‌జీటీలు ఉండాలన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ షేక్ సలీం మాట్లాడుతూ 12పే రివిజన్ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 కరువుభత్యాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ జానీ, పి.గంగరాజు, వై.శంకరం, కనకదుర్గ, విష్ణు, అనితాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి చక్రస్నానం

పెరవలి, మే 12(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడు వెంకన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం స్వామి వారికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి సంకల్పం, మహాశాంతి హోమం, ధ్వజారోహణ జరిపారు. ఉత్సవ విగ్రహాలను శిరస్సుపై ధరించి దేవాలయానికి ఈశాన్య ఉన్న పవిత్ర కోనేటిలో చక్రస్నాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మీసాల రాధాకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.


అన్నవరప్పాడులో శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

విధేయతతో ఉండాలి

నల్లజర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విశ్వాసి విధేయత కలిగి ఉండాలని భీమవరం దీన దెబోరా మినిస్ట్రీస్ దైవజనురాలు దీనాకుమారి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని చీపురుగూడెంలో విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ మరపట్ల జోజి అధ్యక్షతన సంఘ క్షేమాభివృద్ధి కూడిక నిర్వహించారు. ఈ దీనాకుమారి మాట్లాడుతూ దేవుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే దీవెనలు మెండుగా ఉంటాయన్నారు. యేసుప్రభువును విధేయత కలిగి ప్రార్థించడం ద్వారా విజయాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పాస్టర్ కండెల్లి రాజేష్‌కుమార్, కోరపాటి కృష్టాఫర్, మరపట్ల జాన్‌మార్క్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మానుష్యంగా మారిన ఐ లవ్ నిడదవోలు జంక్షన్

మండే ఎండ..

నిడదవోలు, మే 12 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాల్పుల ప్రభావంతో సోమవారం నిడదవోలులో కర్ఫ్యూని తలపించేలా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. ఉదయం 11గంటల నుంచే రోడ్లపై జన సంచారం లేకుండాపోయింది. రహదారులన్నీ వెలవెలబోయాయి. వేడిగాల్పులు, తీవ్ర ఉక్కపోతలతో వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. రోడ్ల పక్క చిరు వ్యాపారులు ఎండ వేడిమికి దుకాణాలు మూసివేసారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరయిన రూ.23,58,631 విలువైన 16 చెక్కులను పంపిణీ చేశారు. చాగల్లు మండలంలో నలుగురికి రూ.10,34,208, తాళ్లపూడి మండలంలో ముగ్గురికి రూ.5,83,483, కొవ్వూరు మండలంలో 9 మందికి రూ.7,40,940 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, అనుపిండి చక్రధరరావు, కేవీకే రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌కార్డులు మంజూరు చేయాలి

కొవ్వూరు, మే 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ అన్నారు.సోమవారం కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదుపై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. సోమసుందర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాత్రికేయులకు మంజూరుచేసిన అక్రిడేషన్ కార్డుల గడువు మే నెలాఖరుకు ముగుస్తుందని, తక్షణమే జీవో జారీచేసి అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు మం జూరు చేయాలన్నారు. పాత్రికేయులపై దాడులను ఖండించారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఎ.సురేష్‌కుమార్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరామ చంద్రమూర్తి, గేదేల సత్యనారాయ, ఎ.అనీల్, ఎస్.శ్రీహరిబాబు, గరగ వరప్రసాద్, తోట అవినాష్, శ్రీరంగం సత్యప్రసాద్, బి.భాను, వై.ఎర్రన్న, సందీప్, నండూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీహోమం


చండీహోమం చేస్తున్న పండితులు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో చండీహోమం నిర్వహించారుసోమవారం ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమిని సందర్భంగా ఉక్కలం వెంకట ప్రసాద్, గంప కృష్ణారావు సౌజన్యంతో విశేష పూజలు, చండీహోమం జరిపించారు. కార్యక్రమంలో చిరావూరి సుబ్రహ్మణ్యం, దామరాజు సచ్చిదానంద, వైవీవీ సత్యనారాయణమూర్తి, గంప కృష్ణారావు, వై.వి.ఎస్. కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాత్సల్యా వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు.కుప్పాల గురుస్వామి నాయుడు మాష్టారు 4వ వర్ధంతి సందర్భంగా సోమవారం వృద్ధాశ్రమంలో గురుస్వామి నాయుడు కుమారుడు కుప్పాల శ్రీనివాస్ వృద్ధులకు నెలకు సరిపడా నిత్యవసరాలు అందజేశారు. నాయుడు లెక్కల మాష్టారుగా ఎంతో మంది విద్యార్థులకు విద్యాదానం అందజేశారన్నారు. కార్యక్రమంలో నగళ్ళపాటి శ్రీనివాస్, యర్రంశెట్టి తిలక్, మాణికిరెడ్డి హరిబాబు, ఆవుల వాసు, కొయ్యల ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): 11 కేవీ ఎల్‌టీ లైన్స్ ఏర్పాటు నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎన్ఎన్ అప్పారావు తెలిపారు. దీంతో మండలంలోని అచ్చయ్యపాలెం, బుచ్చయ్యపాలెం గ్రామాలకు ఉదయం 7గం.ల నుంచి మధ్యాహ్నం 2గం.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

సమస్య ఉంటే.. డయల్ 1100

» కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
» డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్‌లో 9 అర్జీల స్వీకరణ


కొవ్వూరులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరు 1100కు ఫోన్ ద్వారా అర్జీలు అందించవచ్చునని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆమె 9 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వ్యయప్రయాసలకు గురై ఆర్డీవో కార్యాలయానికి రానవసరం లేదని, ప్రతి సోమవారం మండల తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయాలలో మండలస్థాయిలో అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో అధికారులు తప్పనిసరిగా ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.రవివిక్రమ్, వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్ స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించండి

నల్లజర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరుకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్‌ను ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు తొలగించారని, పునరుద్ధరించి న్యాయం చేయాలని మండలంలోని పుల్లలపాడులో గ్రామా నికి చెందిన రైతు కనికెళ్ల పేరయ్య అధికారులకు అర్జీ అందజేశాడు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సింహాద్రిరావు సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పేరయ్య ఈ మేరకు అర్జీ అందజేశాడు. సర్వే నెంబరు 876-2లో తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో మార్చి నెలలో రెవెన్యూ అధి కారుల అనుమతితో విద్యుత్ అధికారుల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్ పొందానన్నాడు. అయితే పది రోజులకే కనెక్షన్ విద్యుత్ అధికారులు తొలగించారని, దీనిపై వారిని ప్రశ్నించగా పక్క రైతు బోరుకు 90మీటర్ల దూరం మాత్రమే ఉందని, ఆ రైతు ఫిర్యాదు మేరకు తొలగించినట్టు చెప్పారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు కొలతలు వేసిననప్పుడు 136 మీటర్ల దూరం ఉండడంతో తమకు అనుమతులు ఇచ్చారని, కనెక్షన్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని రైతు అధికారులను కోరుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రం, ఎంపీటీసీ వేగి ప్రతాప్, రైతులు తాడిగడప శ్రీనివాసరావు, అల్లూరి చిన్న భాస్కరరావు, గంగరాజు, ధర్మయ్య పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పెనకనమెట్టలో భారీ చోరీ

» ఇంటి తాళాలు బద్దలుగొట్టి దొంగతనం
» రూ. 9.80 లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు అపహరణ

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు తెరచి రూ.8 లక్షలు విలువైన బంగారు వస్తువులు, నగదు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మండలంలోని పెనకనమెట్ట గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 11న ఇంటికి తాళంపెట్టి బంధువుల ఇంట పెళ్లికి పందలపర్రు వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగొచ్చి చూసేసరికి తలుపులు తెరచున్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామానులన్నీ చిందరవందరగా ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.9.80 లక్షలు విలువైన 8 కాసుల బంగారం, 250 గ్రాముల వెండి వస్తువులు, రూ.8 లక్షల నగదు దొంగిలించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఇన్‌చార్జి డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, ఎస్ఐ కె.శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్రైం సీఐ శ్రీధర్, క్లూస్ టీం, ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నిడదవోలు, మే 12(ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. నిడదవోలు మండలం తాడిమళ్లలో పంతగాని వెంకటశ్రీను, విమలకుమారి(40) దంపతులు నివాసం ఉంటున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ ఆదివారం రాత్రి భార్య విమలకుమారి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులకు విషయం తెలియడంతో సోమవారం చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం



దేవరపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదానికి గురైన జనసైనికుడు మరపట్ల సురేశ్‌కి జనసేన దేవరపల్లి శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు రూ.20 వేలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాట్నం గణేశ్, అనిశెట్టి గంగరాజు, పసుపులేటి ప్రసాద్, కంబాల సత్తిబాబు, కొడమంచిలి శ్రీను పాల్గొన్నారు.

కార్పొరేషన్ల చైర్మన్లకు అభినందనలు

ఉండ్రాజవరం/పెరవలి/తాళ్లపూడి, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు సంబంధించి నామినేటెడ్ పదవులకు ఎంపికైన నాయకులకు కూటమి నాయకులు, కార్యకర్తలు సోమవారం అభినందనలు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడం పట్ల నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు. నిడదవోలు పట్టణం, రూరల్ మండలం, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వేలివెన్ను వచ్చి ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఏ పదవి ఇచ్చినా దానికి వన్నెతెచ్చే నాయకుడు శేషారావు అని పలువురు కొనియాడారు. పూలమాలలో శేషారావును పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో సింహాద్రి రామకృష్ణ, సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, బూరుగుపల్లి శ్రీనివాసరావు, వెలిచేటి ప్రసాద్, కుడప గోపాలకృష్ణ, బొల్లిన చంద్రశేఖర్, కుడప వెంకటరామారావుతోపాటు పెరవలి మండలం కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, అజ్జరం, నల్లాకులవారిపాలెం గ్రామాల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా టీడీపీ జాతీయ కార్యదర్శి కేఎస్ జవహర్‌ను నియమించడం పట్ల తాడిపూడిలో తెలుగు యువత నాయకుడు నామా సురేంద్ర ఆధ్వర్యంలో ఆనందోత్సవాలు నిర్వహించారు. సురేంద్ర మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతిఒక్కరికీ తెలుగుదేశం పార్టీ తగిన ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జవహర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.



శేషారావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు, జవహర్‌కు అభినందనలు తెలుపుతున్న సురేంద్ర



చంద్రబాబును కలిసిన శేషారావు

ఉండ్రాజవరం, మే 12(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక కావడంతో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఏపీఎస్ఎస్‌డీసీ పదవి ఇవ్వడం పట్ల ఆనందంగా ఉందని,పదవికి మంచిపేరు తీసుకొస్తానని, యువతకు నైపుణ్యాలు అందించడంలో కృషి చేస్తానని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

» జిల్లా, మండల కార్యవర్గాల సభ్యుల నియామకం
» జూన్ మొదటి వారంలో దుద్దుకూరుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి
» పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్


కాంగ్రెస్ నాయకులకు నియామకపత్రాలు అందజేస్తున్న మార్టిన్ లూథర్

దేవరపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని మండలాల కమిటీల అధ్యక్షుల్ని నియమించటం జరిగిందని రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ పేర్కొన్నారు. మండలంలోని దుద్దుకూరు గ్రామంలో సోమవారం కాంగ్రెస్‌పార్టీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో మండల కమిటీల నియామక పత్రాలను మార్టిన్ లూథర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి జిల్లా, మండల స్థాయి కార్యవర్గ సభ్యులను నియమించారన్నారు. కాంగ్రెస్ జిల్లా కోశాధికారిగా దుద్దుకూరుకు చెందిన వెలగా రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏగివాడ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా యండపల్లి శ్రీమన్నారాయణ ప్రసాద్, జిల్లా కార్యదర్శిగా కృష్ణచైతన్య, జనరల్ కార్యదర్శిగా రామకృష్ణ, నల్లజర్ల బ్లాక్-2 అధ్యక్షుడిగా డి.ఫ్రాన్సీస్, నల్లజర్ల మండలాధ్యక్షుడిగా ఏడుకొండలు, దేవరపల్లి మండలాధ్యక్షుడిగా పాకా చిన్నబ్బాయి, గోపాలపురం మండలాధ్యక్షుడిగా సుంకర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దాసరి కుటుంబరావు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా గుత్తికొండ సూరిబాబు, దేవరపల్లి మండల ఉపాధ్యక్షుడిగా పాపోలు గంగారావు, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాకర్ల శ్రీహరిబాబులను ఎంపిక చేసినట్టు మార్టిన్‌లూథర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో వైఎస్ షర్మిళా దుద్దుకూరును సందర్శిస్తారని, అనంతరం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అడుసుమిల్లి రమేశ్‌చౌదరి, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


నిడదవోలులో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

పెరవలి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బామ్మ చెప్పిన బంగారు నీతి కథలు వివరించారు. అనంతరం విద్యార్థులు కథల పుస్తకాలు చదివి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమాల్లో రిసోర్సుపర్సన్లు ఎన్.పుష్పావతి, ఎండీ ప్రియాంక, పి.భార్గవి,వక్త కొంపెల్ల పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో చిన్నారులకు పుస్తక పఠనం, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలపై అవగాహన కలిగించారు. గ్రంథాల యాలను చిన్నారులు, విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు, పలువురు వక్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు టార్గెట్‌లు పెంచాలి


ఆందోళన చేస్తున్న రైతులు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ ప్రకారం 1121 పీఆర్‌పీ రకం ధాన్యం ప్రతి గింజను రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచి రైతులు, కౌలు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. రబీ ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, కొనుగోలు నిలుపుదల చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో కొనుగోలు చేయాల్సిన ధాన్యం కల్లాల్లో ఉండిపోయిందన్నారు. వాహనాల్లో లోడ్ చేసిన ధాన్యానికి కిరాయిలు పెరిగి రైతులు నష్టపోతున్నారన్నారు. టార్గెట్ పెంచకపోతే ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేక నష్టపోతారన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల్లో లోడ్ చేసిన ధాన్యాన్ని టార్గెట్ పెంచి మిల్లులకు తరలించాలన్నారు.

వేతన ఒప్పందం తక్షణం అమలు చేయాలి

» ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు మస్తాన్
» క్వారీ క్రషర్ల ఆపరేటర్లు, హెల్పర్ల ఆందోళన

దేవరపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): క్వారీ క్రషర్ల యాజమాన్యాలు వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ డిమాండ్ చేశారు. గౌరీపట్నంలో క్రషర్లు, క్వారీల వద్ద పని చేసే ఆపరేటర్లు, హెల్పర్లు నూతన ఒప్పందం అమలు చేయాలని శుక్రవారం సమ్మెబాట ప్రకటించి ఆందోళన చేపట్టారు. గతంలో చేసుకున్న వేతన ఒప్పందం ఏప్రిల్ 22వ తేదీతో ముగియడంతో తిరిగి నూతన వేతనొప్పందం వల్ల ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నూతన ఒప్పందం అమలు చేయాలని ఆందోళన చేపట్టారు. వేతన ఒప్పందం ముగిసి 20రోజులైనప్పటికీ క్వారీ క్రషర్ యాజమాన్యాలు స్పందించడం లేదని విమర్శించా రు. వెంటనే వేతన ఒప్పందాన్ని అమలు చే యాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందని, ప్రస్తుతం కార్మికవర్గం సంఘటితంగా పోరాడి ఐక్యంగా ఉద్యమాల ద్వారానే తమ హక్కులు సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్.రమేశ్, నాగేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక, ప్రొక్లెయినర్ సంఘం అధ్య క్షుడు గణపతి, నాయకులు, శ్రీను, రవికుమార్, వీరపండు తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీకి సామూహిక కుంకుమ పూజలు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారికి వైశాఖమాస పౌర్ణమి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని మల్లె పువ్వులతో అలంకరణ చేసి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. సుందరేశ్వరస్వామిని మామిడి పండ్ల రసంతో అభిషేకించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ జీవిత కథ ఆధారంగా త్వరలో సినిమా

ప్రొడ్యూసర్ పోతి శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి: ఆంధ్ర అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మ జీవిత కథ ఆధారంగా భారీ తారాగణంతో, భారీ బడ్జెట్‌తో శ్రీశ్రీ సత్యదేవ ప్రొడక్షన్ నెం.1 పేరిట గోదావరి తీరంలో జూన్ మొదటి వారం నుంచి ప్రారంభిస్తున్నామని ప్రొడ్యూసర్ పోతి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. రచయిత మురళీ రమేష్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ నివాస స్థలాన్ని సందర్శించి, వారి బంధువులు, గ్రామ ప్రజల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించి వాస్తవ గాథను తెరకెక్కిస్తున్నామన్నారు. తారాగణం ఎంపిక జరిగిందని, జూన్ నెలలో గోదావరి మాగాణీ లోనే షూటింగ్ అంతా ఉంటుందన్నారు. డైరెక్టర్ చిరువోలు మురళీ మాట్లాడుతూ డైరెక్షన్‌లో గతానుభవంతో తొలి చిత్రాన్ని తీయడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.